ప్రజాశక్తి

సోమవారం 23 జూన్ 2025 | 8 పేజీలు

ఎన్‌టిఆర్

కృష్ణా

మచిలీపట్నంలో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

ఉపాధ్యాయుల నిరసన

బదిలీల కౌన్సెలింగ్‌లో మొత్తం పోస్టులు చూపాలని ధర్నా

ఉన్నతాధికారుల జోక్యంతో ఆలస్యంగా కౌన్సెలింగ్ ప్రారంభం

ప్రజాశక్తి - కలెక్టరేట్ (కృష్ణా) : నిరసనలు, గందరగోళాల మధ్య డిఎస్‌సి-2008, 1998 ఎంటిఎస్ ఉపాధ్యాయుల బదిలీల కౌన్సెలింగ్ ముగిసింది. ఉమ్మడి కృష్ణాజిల్లా వ్యాప్తంగా ఉన్న ఎంటిఎస్ ఉపాధ్యాయుల బదిలీల కౌన్సెలింగ్ ఆదివారం మచిలీపట్నంలోని కృష్ణా జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో నిర్వహించేందుకు విద్యా శాఖాధికారులు సన్నాహాలు చేశారు. ఈనేపథ్యంలో ముందుగా ఖాళీలను ప్రకటించారు. అయితే మొత్తం ఖాళీలు ప్రకటించకపోవడంతో ఉపాధ్యాయులు జిల్లా విద్యా శాఖాధికారి కార్యాలయం ఎదుట నిరసనకు దిగారు. ఖాళీలన్నీ చూపాలని నినాదాలు చేశారు. దీంతో స్పందించిన జిల్లా విద్యాశాఖాధికారి పివి.జె.రామారావు ఉపాధ్యాయులతో చర్చలు జరిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారమే కౌన్సెలింగ్ ఉంటుందని తెలిపారు. అయితే విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కారం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. దీంతో ఉపాధ్యాయులు నిరసన విరమించారు. ఉన్నతాధికారుల ఆదేశానుసారం జిల్లాలో ఉన్న ఖాళీలన్నీ ప్రకటించడంతో ఆదివారం రాత్రి 8 గంటల నుండి కౌన్సెలింగ్ ప్రక్రియను ప్రారంభించారు. మొత్తం 264 మంది కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు.

భారీగా జిజిఎంపి బిల్లులు పెండింగ్

● కాంట్రాక్టర్లు లబోదిబో ● 'నీరు - చెట్టు' బిల్లుల్లా వ్యవహారం

ప్రజాశక్తి - విజయవాడ

గడప గడపకు మన ప్రభుత్వం (జిజియంపి) పథకం బిల్లుల వ్యవహారం మరో నీరు-చెట్టు పథకం మాదిరి తయారైంది. 2014లో అప్పటి టిడిపి ప్రభుత్వం పెద్దఎత్తున చేపట్టిన 'నీరు-చెట్టు' పథకానికి సంబంధించి కోట్లాది రూపాయల బిల్లులను 2019లో అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం నిలుపుదల చేసిన విషయం తెలిసిందే. అయితే గత ఏడాది మళ్లీ అధికారంలోకి వచ్చిన టిడిపి ప్రభుత్వం ఆగిపోయిన నీరు-చెట్టు బిల్లులను అడపాదడపా చెల్లిస్తోంది. ఈక్రమంలో గత వైసిపి ప్రభుత్వ హయాంలో 2023-24లో చేయించిన గడప గడపకూ మన ప్రభుత్వం (జిజిఎంపి) పనులకు సంబంధించి కోట్లాది రూపాయల పెండింగ్ బిల్లులను ప్రస్తుత టిడిపి ప్రభుత్వం పూర్తిగా పక్కన పెట్టింది. దీంతో విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో జిజిఎంపి పనులు చేసిన కాంట్రాక్టర్లకు పెద్దమొత్తంలో బిల్లులు నిలిచిపోయాయి. బిల్లులు మంజూరు కాక లబోదిబోమంటున్నారు. పలువురు కాంట్రాక్టర్లయితే చేసిన అప్పులు తీర్చలేక, అప్పుల వారి నుండి వస్తున్న వత్తిడి తట్టుకోలేక అనారోగ్యం పాలవుతున్నారు. కొందరు ఆత్మహత్యాయత్నాలకు కూడా పాల్పడిన ఘటనలు ఉన్నాయి. విజయవాడలో అప్పటి వైసిపి ప్రభుత్వ వత్తిడి మేరకు విఎంసి ఇంజినీరింగ్ అధికారులు కాంట్రాక్టర్ల మెడపై కత్తిపెట్టినట్లు వ్యవహరించి వివిధ రకాల పనులు చేయించారు. అయితే నగరంలోని మూడు సర్కిళ్ల పరిధిలో వీటికి సంబంధించి రూ.15 కోట్ల వరకు పెండింగ్ బిల్లులు సదరు కాంట్రాక్టర్లకు నేటికీ చెల్లింపులు జరగలేదు. చేయించిన పనుల్లో రూ.13.5 కోట్ల వరకు గతంలోనే బిల్లులు చెల్లింపులు జరిగినట్లు ఇంజినీరింగ్ అధికారులు చెబుతున్నారు. రూ.15 కోట్ల పెండింగ్ బిల్లులకు సంబంధించి సదరు కాంట్రాక్టర్ల ఇబ్బందికర పరిస్థితులను వివరిస్తూ, తక్షణమే పెండింగ్ బిల్లులు విఎంసి జనరల్ ఫండ్ నుంచి మంజూరు చేయించాలని కోరుతూ విఎంసి కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్రను కాంట్రాక్టర్లు కలిసి వివరించారు. దీనిపై సదరు కమిషనర్ చీఫ్ ఇంజినీర్ శ్రీనాథరెడ్డిని ఆదేశిస్తూ... జిజిఎంపికి సంబంధించి పెండింగ్ బిల్లులు ఎంత, సదరు కాంట్రాక్టర్లు ఎంత మంది ఉన్నారు...బిల్లులకు సంబంధించి పూర్తి స్థాయి నివేదికను తయారు చేశారు. అనంతరం పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలని కోరుతూ తక్షణమే రాష్ట్ర ప్రభుత్వానికి లెటర్ పంపించాలని చీఫ్ ఇంజినీర్‌ను కమిషనర్ ఆదేశించినట్లు తెలిసింది. ఈనేపథ్యంలో సదరు చీఫ్ ఇంజినీర్ మూడు సర్కిల్స్ పరిధిలో ఇఇల స్థాయిలో జిజిఎంపి పెండింగ్ బిల్లుల పూర్తి స్థాయి సమాచారాన్ని తెప్పించుకొని, నివేదికను తయారు చేసి, నగర కమిషనర్‌కు అందజేసిన తరువాత, పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని ప్రభుత్వానికి లేఖ రాస్తున్నట్లు అధికారులు వివరిస్తున్నారు. అయితే జిజిఎంపి పథకం, దానికి సంబంధించిన పెండింగ్ బిల్లుల చెల్లింపుల వ్యవహారం ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా పట్టించుకోకుండా (మిగతా 2లో)

'తల్లికి వందనం'కు 75 శాతం హాజరు తప్పనిసరి

ప్రజాశక్తితో కృష్ణాజిల్లా డిఇఒ పి.వి.జె.రామారావు

ప్రజాశక్తి - కలెక్టరేట్ (కృష్ణా) : రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులు మేరకు విద్యార్థులకు 75 శాతం హాజరు ఉంటేనే తల్లికి వందనం పథకం వర్తిస్తుందని జిల్లా విద్యాశాఖాధికారి పి.వి.జె.రామారావు తెలిపారు. పాఠశాలలు పున:ప్రారంభం దష్ట్యా పలు విద్యా రంగ అంశాలపై ఆయన ప్రనజాశక్తికి ఇంటర్వ్యూ ఇచ్చారు.

ప్రశ్న : ప్రభుత్వం ఈనెల 12న పాఠశాలలను పున: ప్రారంభించిన నేపథ్యంలో 'తల్లికి వందనం' పథకం ఎంత మంది విద్యార్థులకు అమలైంది? ఎంతమంది విద్యార్థులున్నారు ?

వ ం ం ం ద ´ ం గా తల్లిదండ్రులంతా ఒక్క విషయాన్ని గుర్తుపెట్టుకోవాలి. పాఠశాలలకు వెళ్లే విద్యార్థికి కనీసం 75 శాతం హాజరు ఉంటేనే తల్లికి వందనం పథకం వర్తిస్తుంది. అలాగే కొన్ని నిబంధనలు ప్రభుత్వం విధించింది. వాటికి లోబడి ఉంటేనే ఈ పథకానికి అర్హత సాధిస్తారు. అలాగే అర్హులైన విద్యార్థుల విషయానికి వస్తే గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా అర్హుల జాబితా ప్రకటించాం. అందువల్ల విద్యార్థుల జాబితాకు సంబంధించి సమాచారం వారి వద్దే ఉంటుంది. ఈ విషయంలో తల్లిదండ్రులకు అనుమానాలుంటే నివత్తి చేసుకునేందుకు దగ్గరలోని వారి గ్రామ, వార్డు సచివాలయాల్లో అధికారులను సంప్రదించాలి. సందేహాలను నివత్తి చేసుకోవాలి.

ప్రశ్న : ఈ విద్యా సంవత్సరం ప్రారంభం రోజునే విద్యార్థులందరికీ విద్యామిత్ర కిట్లు కింద పుస్తకాలు, బెల్టులు, యూనిఫాం, బ్యాగ్ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది కదా. ప్రకటించిన విధంగా అన్ని వచ్చాయా లేదా ?

ఒక్క బ్యాగ్ మినహా మిగతా వస్తువులన్నీ వచ్చాయి. విద్యార్థులందరికీ పంపిణీ కూడా చేశాం. బ్యాగులు కూడా ఈ వారంలో వస్తాయి. రాగానే అన్ని మండలాలకు పంపి వారి ద్వారా విద్యార్థులకు అందించే చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న : జిల్లాలో కొనసాగుతున్న కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలలకు అన్ని అనుమతులు ఉన్నాయా ? లేవా?

అ న ం వ ం త ం ల తో నే కొనసాగుతున్నాయి. ఒకవేళ అనుమతి లేకుండా కొనసాగించినా, రెన్యువల్ చేయించుకోకుండా కొనసాగించినా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న : నిబంధనలకు వ్యతిరేకంగా జిల్లాలో దాదాపు అన్ని కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలల్లో పుస్తకాలు అమ్మకాలు సాగిస్తున్నారు. ఇలా చేయడం విద్యా హక్కు చట్టాన్ని ఉల్లంఘించడమే కదా! ఇలాంటి పాఠశాలలపై (మిగతా 2లో)

సూరంపల్లి గబ్బిలాల కుంటలో జరుగుతున్న తవ్వకాలు

అనుమతి గోరంత... తవ్వేది చెరువంత...

● యథేచ్ఛగా మట్టి అక్రమ తవ్వకాలు
● నిబంధనలు బేఖాతరు

ప్రజాశక్తి - గన్నవరం : గన్నవరం మండలంలోని మైనర్ ఇరిగేషన్ చెరువుల్లో మట్టి అక్రమ తవ్వకాలు యధేచ్ఛగా సాగుతున్నాయి. ఈ విషయం ఏ గ్రామంలో రైతును అడిగినా చెబుతున్నారు. అధికార టిడిపి నేతల అండదండలతో పలు గ్రామాల్లోని చెరువుల్లో పొక్లెయిన్లతో మట్టి తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. ఇళ్ల స్థలాలు, పొలాల మెరకకు మట్టి తరలింపు సాకుతో తాత్కాలిక అనుమతులు పొందుతున్న అక్రమార్కులు దర్జాగా మట్టి అమ్ముకుంటున్నారు. నిబంధనలను తుంగలో తొక్కి ఇష్టారాజ్యంగా మట్టి తవ్వకాలు సాగిస్తూ టిప్పర్లు, ట్రాక్టర్లతో ప్రైవేట్ స్థలాలకు తరలిస్తున్నారు. అసలు ఎలాంటి అనుమతులూ లేకుండానే మరికొందరు అధికార పార్టీ నేతలు మట్టి తవ్వకాలతో లక్షల్లో సొమ్ము (మిగతా 2లో)

కన్యకా పరమేశ్వరి ఆలయ కార్యవర్గం ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి- నందిగామ : నందిగామ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ అధ్యక్ష కార్యదర్శులు, కోశాధికారులుగా చవట నాగేశ్వరరావు, వనమా నరసింహారావు, బుల్లెబ్బాయి, మారం వెంకట సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం వాసవి కన్యకాపరమే శ్రీదేవి ఆలయంలో సర్వసభ్య సమావేశం జరిగింది. నూతన కార్యవర్గ కమిటీ ఎన్నిక నిర్వహించారు. అనంతరం కార్యవర్గ సభ్యులను ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ యేచూరు రామకష్ణ, గోపు శ్రవణ్ కుమార్, మారం వెంకటేశ్వరరావు గోపుకిరణ్, మారం అమరయ్య, కొత్త ప్రభాకర్ రావు, అడ్డగిరి వెంకటేశ్వరరావు, మారం శ్రీనివాసరావు పలువురు ఘనంగా సత్కరించారు.

ప్రమాణ స్వీకారంలో జిల్లా గవర్నర్ శేషగిరి తదితరులు

లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి - మైలవరం : లయన్స్ క్లబ్ ఆఫ్ మైలవరం, లయన్స్ క్లబ్‌ఆప్ నర్సింహారావు పాలెం ప్లాటినం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమం 316డి జిల్లా గవర్నర్ లయన్ గద్దె శేషగిరి అధికారిక పర్యటన కార్యక్రమం ఆదివారం సాయంత్రం స్థానిక ఎస్వీఎస్ కళ్యాణ మండపంలో ఘనంగా జరిగింది. ఈసందర్భంగా గద్దె శేషగిరి మాట్లాడుతూ లయనిజం అంటే సేవ అని, సేవ చేయటం ద్వారానే లయ నిజానికి గుర్తింపు వస్తుందని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా లయ నిజం ఉందన్నారు. ఈ సందర్భంగా చనుమోలు నాగభూషణం, చింతల దర్శ చెన్నారెడ్డి అధ్యక్షులుగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం కమిటీ హానరరీ చైర్‌పర్సన్ ఎస్వీ సుధాకర్ రావు, ఫాస్ట్ మల్టిపుల్ కౌన్సిల్ చైర్ పర్సన్ లయన్ ఎస్‌విఎన్ నివత రావు, డిసి డాక్టర్ సిహెచ్ బాలగోపాల్ రెడ్డి, గవర్నర్స్ ఏరియా రిప్రజెంటేటివ్ జాస్తి వెంకటేశ్వరరావు, పాస్ట్ మల్టిపుల్ కౌన్సిల్ పర్సన్ లింగమ శివ శంకర్, గాట్ ఏరియా లీడర్ ముల్పూరి ఉపేంద్ర, డిస్టిక్ గవర్నర్ ఎలెక్ట్ వివిపిఎస్ ఆంజనేయులు,, లైన్ మెంబర్లు పాల్గొన్నారు.

ఇంద్రకీలాద్రిపై రద్దీ

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : దుర్గమ్మ ఆలయం ఆదివారం కిటకిటలాడింది. ఇంద్రకీలాద్రిపై యాత్రికుల రద్దీ పెరిగింది. వేసవి సెలవులు ముగియడంతోపాటు ఆదివారం సెలవు కావడంతో వేకువజాము నుంచి ఇంద్రకీలాద్రికి యాత్రికులు పోటెత్తారు. కొండ దిగివున వున్న కేశఖండన శాలలో మొక్కులు చెల్లించుకున్న యాత్రికులు కష్ణా నదిలో స్నాన మాచరించి ఘాట్ రోడ్, కనక దుర్గా నగర్ల మీదుగా ఉచితం క్యూ లైన్ల తోపాటు రూ.100, రూ.500 టికెట్లు కొనుగోలు చేసి ఆయా క్యూలైన్ల మార్గం ద్వారా దుర్గమ్మను దర్శించుకున్నారు. అయితే ఉదయం పది గంటల నుంచి యాత్రికుల రద్దీ పెరిగిన దష్ట్యా మధ్యాహ్నం 1 గంట వరకు అంతారాలయం దర్శనాన్ని రద్దు చేసి అమ్మవారి దర్శనం సులభంగా జరిగేలా ఈవో శీనా నాయక్ చర్యలు తీసుకున్నారు. ఈ క్రమంలోనే ఈవో స్వయంగా కొండపై నుండి దిగువ మార్గం వరకు కాలినడకన ప్రయాణం చేసి క్లోక్ రూమ్, చెప్పుల స్టాండ్, మొబైల్ భద్ర పరచు గదుల వద్దతోపాటు కొబ్బరికాయలు కొట్టే ప్రాంతం ప్రసాదం కౌంటర్లు అన్న ప్రసాదశాలలో ఆలయ సిబ్బంది అందిస్తున్న సేవాసౌకర్యల గురించి యత్రికులను అడిగి తెలుసుకున్నారు. యాత్రికులకు మెరుగైన సౌకర్యాలు అందించేందుకు దేవస్థాన సిబ్బందితో కలిసి పనిచేసేందుకు తమ వంతు కషి చేయనున్నట్లు ఈవో వెల్లడించారు.

In the Honble Court of the II Additional Junior Civil Judge at Vizianagaram
O.S.No. 517/2024

Between :
Sri Peratla Srirama Murthy ....Plaintiff
And :
M/s. Saharogya Health Care Pvt. Limited and another ......Defendants

Notice to Defendant No. 1&2

Defendant No : 1
M/s. Saharogya Health Care Pvt. Limited, D.No. 22-49, Flat No.402, Hardhik Platina, D.D. Colony, Bagh Amberpet, Hyderabad-500013, Talengana State.

Defendant No : 2
Sirivella Anil Kumar (CAO of M/s. Saharogya Health Care Private Limited) S/o. S.Ananda Kumar, D.No. 49-2-97, Urmila Nagar, Gunadala, Station Road, Vijayawada (Urban), Krishna Machavaram - 520004, Andhra Pradesh.

Hg date : 02-07-2025

పైన పేర్కోన్న ప్లయింటిప్ మీ ఇరువురు డిఫెండంట్స్ పై దావా వేసియున్నారు. సదరు దావాలో మీ ఇరువురు శ్రీ కోర్టువారి నుండి ఎన్ని పర్యాయములు నోటీసులు పంపిననూ తీసుకోనందున మీ ఇరువురి హాజరు నిమత్తం తే 02-07-2025దిన వాయిదా కలదని శ్రీ కోర్టువారి ఆదేశానుసారం ఈ పత్రికా ప్రకటన ద్వారా తెలియజేయుచున్నాము. కావున **తే 02-07-2025దీన ఉదయం గం॥ 10-30 ని॥లకు** మీరు ఇరువురు స్వయంగా కాని లేక వకీలు గారి ద్వారా గాని పై కోర్టులో హాజరై మీ యొక్క ఆక్షేపణలు తెలియజేయవలెను. లేనిచో కోర్టువారు మీ పరోక్షమున విచారించి తీర్మానించబడునని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

(కోర్టువారి ఆర్డరు ప్రకారం)

బి.శ్రీనివాస్ కుమార్
ప్లయింటిఫ్ తరపున న్యాయవాది,
విజయనగరం,
సెల్ : 7780409899

మొదటిపేజీ తరువాయి

వెంచర్ల కోసం తోలిన మట్టి

అనుమతి గోరంత...తవ్వేది చెరువంత...

చేసుకుంటున్నారే ఆరోపణలు వస్తున్నాయి.

నిబంధనల ఉల్లంఘనలు

ఇళ్ల స్థలాలు, పొలాల మెరకకు మట్టి తరలింపు సాకుతో చెరువుల్లో మట్టి తవ్వకాలకు ఇరిగేషన్ శాఖ నుంచి తాత్కాలిక అనుమతులు పొందుతున్న అధికార పార్టీ నాయకులు అడ్డూ అదుపు లేకుండా నిబంధనలు ఉల్లంఘిస్తున్నారు. నిర్ణీత లోతు లేదా నిర్ణీత క్యూబిక్ మీటర్ల మట్టిని మాత్రమే తవ్వాలని అనుమతుల్లో స్పష్టంగా పేర్కొంటున్నప్పటికీ ఆచరణలో అమలు చేయడం లేదు. నిబంధనలను బేఖాతరు చేస్తూ ఇష్టారాజ్యంగా మట్టిని తరలిస్తున్నారు. మరికొన్ని చోట్ల వారంరోజులకు అనుమతి మంజూరైతే పది రోజులపాటు యధేచ్ఛగా చెరువుల్లో తవ్వకాలు సాగిస్తున్నారు. పొలాల మెరకకు ఇచ్చిన అనుమతులను అడ్డుపెట్టుకుని ప్రైవేట్ స్థలాలకు మట్టిని తరలిస్తూ అక్రమార్కులు జేబులు నింపుకుంటున్నారు. ఒక్కో ట్రాక్టర్‌కు కనీసం రూ.600 వరకు వసూలు చేస్తున్నారు. చెరువుల్లో పూడికతీత పేరుతో ఇష్టారాజ్యంగా తవ్వుతూ లోతైన గుంతలు పెడుతున్నారు.

ఈ చెరువుల్లో తవ్వకాలు

గన్నవరం మండలం సూరంపల్లి గబ్బిలాల కుంట చెరువులో ట్రాక్టర్లలో మట్టిని తరలిస్తున్నారు. ఇళ్ల స్థలాలతోపాటు వెంచర్లకు, ఖాళీ ప్లాట్లకు మట్టిని తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇష్టానుసారంగా గోతులు పెట్టేస్తున్నారని గ్రామస్తులు చెబుతున్నారు. రోజుకు 200 ట్రాక్టర్లకుపైగా మట్టిని తవ్వుతున్నారు. ఇటుక బట్టీలకు కూడా మట్టి తరలిపోతోందని గ్రామస్తులు తెలిపారు. తెంపల్లి తుమ్మల చెరువులోనూ మట్టి తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. రాత్రి 9 గంటలకు మట్టిని గన్నవరం తరలించి జేబులు నింపుకుంటున్నారని గ్రామ రైతులు చెబుతున్నారు. చెరువుల సంఘం అధ్యక్షులు కాసులు ఈ అక్రమ తవ్వకాలపై ప్రశ్నిస్తే పొక్లయినర్ యజమాని ఆయనపై తిరగబడ్డాడు. "నిన్ను ఎవడ్రా ప్రెసిడెంట్‌ను చేసింది" అంటూ నోటికొచ్చినట్లు దుర్భాషలాడాడని కాసులు ఆవేదన వ్యక్తం చేశాడు. చెరువు కట్ట అంచున పెద్దగోతులు పెట్టడాన్ని కాసులు ప్రశ్నించడంతో అక్రమ తవ్వకందారులు ఆయనపై దౌర్జన్యానికి దిగారు. దీనిపై ఎంఎల్‌ఎ యార్లగడ్డ విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకోవాలని తెంపల్లి రైతులు కోరుతున్నారు. అలాగే వీరపనేనిగూడెంలోని ములగలమ్మ చెరువులో లారీలు పెట్టి మట్టిని తరలిస్తున్నారు. రాత్రి వేళల్లో ఈ తవ్వకాలు సాగుతున్నాయి. ఇటుక బట్టీలకు కూడా మట్టిని తరలిస్తున్నారు. వెంచర్ల కోసం కొనుగోలు చేసిన పొలాలకు మట్టి తోలుతున్నారని రైతులు తెలిపారు. చిన్నపాటి అవకాశాన్నీ వదలకుండా జేబులు నింపుకునేందుకు కొంతమంది అక్రమార్కులు మట్టి దోపిడీకి తెగబడుతున్నారని చెబుతున్నారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ, పంచాయతీరాజ్, ఇరిగేషన్ అధికారులు అటు వైపుగా కన్నెత్తి కూడా చూడకపోవటంతో అక్రమాలకు అడ్డూఅదుపు లేకుండా పోయింది. ఈవ్యవహారంపై కొందరు గ్రామస్తులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిసింది. ఇప్పటికే ఎంఎల్‌ఎ కార్యాలయానికి ఫిర్యాదులు వెళ్లాయని సమాచారం. ఇరిగేషన్ అధికారులు ఫిర్యాదు చేసేందుకు ప్రయత్నించినా కనీసం ఫోను తీయని పరిస్థితి ఉందని చెబుతున్నారు.

సూరంపల్లి చెరువు వద్ద ఉద్రిక్తత

సూరంపల్లి గబ్బిలాల కుంట (చెరువు) వద్ద ఉద్రిక్తత నెలకొంది. చెరువు తవ్వుతున్న వ్యక్తులు ట్రాక్టర్లలో మట్టి పోసే విషయమై సూరంపల్లికి చెందిన గ్రామ మాజీ టిడిపి ప్రధాన కార్యదర్శి, దళిత యువకుడు ప్రశ్నించడంతో చెరువు తవ్వుతున్న వ్యక్తి చెయ్యి చేసుకున్నట్లు తెలిసింది. ఈ విషయం తెలుసుకున్న దళితవాడ యువకులంతా చెరువు దగ్గరకు వెళ్లడంతో ఉద్రిక్తత ఏర్పడింది. దళిత యువకుడిని కొట్టిన వ్యక్తులు పరారయ్యారు. కొట్టిన వ్యక్తి... ఆతర్వాత దళిత యువకుడికి క్షమాపణ చెప్పడంతో పరిస్థితి సద్దుమణిగిందని గ్రామస్తులు తెలిపారు.

భారీగా జిజిఎంపి బిల్లులు పెండింగ్

పక్కన పడేసినట్లు అటు బాధిత కాంట్రాక్టర్లు, ఇటు అధికారులు చెబుతున్నారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో 'నీరు-చెట్టు' పథకానికి సంబంధించి కోట్లాది రూపాయల పెండింగ్ బిల్లుల రాబట్టుకోవడానికి బాధిత కాంట్రాక్టర్లు హైకోర్టు బాట పట్టినట్లుగానే... ఇప్పుడు ఈ ప్రభుత్వం కాలంలో పెండింగ్ జిజిఎంపి బిల్లుల కోసం పలువురు కాంట్రాక్టర్లు హైకోర్టుకు వెళ్లే పరిస్థితి ఉంది. అయితే అటు రాజకీయంగా, ఇటు ఆర్థికంగా అవకాశం లేని వారు కోర్టుకు వెళ్ల లేక, విఎంసి అధికారుల చుట్టూ చెప్పులరిగేలా తిరుగుతున్నా ఫలితం ఉండటం లేదని కాంట్రాక్టర్లు ఆందోళన, ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీటితోపాటు గడిచిన రెండు మూడేళ్ల కాలంలో విఎంసి పరిధిలో చేయించిన వివిధ రకాల రోడ్లు, డ్రైయిన్లు, కల్వర్టులు తదితర పనులకు సంబంధించి సుమారు రూ.40 కోట్లకు పైగా బిల్లులు పెండింగ్‌లోనే ఉన్నట్లు తెలిసింది. అయితే ఖజానాలో డబ్బులు లేకపోవడంతో పెండింగ్‌లో ఉన్న రూ.40 కోట్లకు సంబంధించి ప్రతి కాంట్రాక్టర్‌కు జనరల్ నిధుల నుంచి రూ.5 నుండి 10 లక్షల వరకు బిల్లులను కమిషనర్ మంజూరు చేస్తున్నట్లు కాంట్రాక్టర్లు వివరిస్తున్నారు. అయితే పెండింగ్ బిల్లులతోపాటు మళ్లీ వివిధ రకాల పనులు చేయించాలంటే చిన్న స్థాయి కాంట్రాక్టర్లకు పూర్తి స్థాయిలో బిల్లులు ఇచ్చినట్లయితే కొంత వరకు వెసులు బాటు ఉంటుందని అంటున్నారు.

'తల్లికి వందనం'కు 75 శాతం హాజరు తప్పనిసరి

ఎటువంటి చర్యలు తీసుకుంటారు ? ఇప్పటివరకు ఏ పాఠశాల పైనైనా చర్యలు తీసుకున్నారా?

జిల్లాలో ఏ కార్పొరేట్, ప్రైవేటు పాఠశాల కూడా పుస్తకాలు అమ్మకూడదు. అలా కాకుండా నిబంధనలు అతిక్రమించి అమ్మినట్లు రుజువైతే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం. అయితే వారు పుస్తకాలు అమ్ముతున్నట్లు సాక్ష్యాధారాలతో ఫిర్యాదు చేస్తే ఆ పాఠశాలపై చర్యలు తీసుకోవడంతోపాటు అవసరమైతే దాని గుర్తింపును రద్దు చేస్తాం.

ప్రశ్న : కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థల బస్సులు ఎన్ని ఫిట్‌నెస్ కలిగి ఉన్నాయి? మీరేమైనా పరిశీలించారా ?

జిల్లాలో రవాణా శాఖ నుండి పాఠశాలల బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తీసుకున్న తర్వాతే బస్‌లను రోడ్లపై తిప్పాలి. అలా కాకుండా తిప్పితే రవాణా అధికారులతో తనిఖీలు చేయించి ఆయా పాఠశాలల యాజమాన్యాలపై చర్యలకు సిఫార్సు చేస్తాము.

ప్రశ్న : గత విద్యా సంవత్సరం పరీక్షా ఫలితాలు సంతప్తి నిచ్చాయా ?

ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో మంచి ఫలితాలు వచ్చాయి. దీంతో ప్రభుత్వ పాఠశాల పట్ల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు మక్కువ చూపుతున్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు 10,687 మంది హాజరైతే, 8,075 మంది ఉత్తీర్ణత సాధించారు. 75.56 శాతం ఉత్తీర్ణత సాధించగలిగాం. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు మొత్తం 600 మార్కులకుగాను 591, 589, 589, 588, 549 మార్కులు సాధించి జిల్లాలో టాపర్లుగా నిలిచారు.

ప్రశ్న : చివరిగా విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు మీరిచ్చే సూచనలు, సలహాలు ఏమిటి ?

ప్రభుత్వం విద్యకు బడ్జెట్లో అధిక ప్రాధాన్యత ఇస్తోంది. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ మంచి ఫలితాల కోసం మా ఉపాధ్యాయులు పెద్దఎత్తున కృషి చేస్తున్నారు. ఆంగ్ల మాధ్యమంతోపాటు కంప్యూటర్ శిక్షణ కూడా ఇస్తున్నాము. అలాగే ఆట స్థలాలు, ఇతర అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నాము. అలాగే ఉచిత విద్యతోపాటు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందిస్తున్నాము. ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుని ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభ్యాసనకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరుకుంటున్నాము.

శ్రద్ధాంజలి

జననం : 18-2-1946
మరణం : 22-6-2025

కీ॥శే॥ శ్రీమతి **తవ్వా కనకదుర్గా వరలక్ష్మి** గారు
W/o బెజవాడ రాజారావు
సహవ్యవస్థాపకులు : బెజవాడ రాజారావు హైస్కూలు
అరవింద వీధి, విద్యాధరపురం, విజయవాడ -12
రిటైర్డు గ్రేడ్ - 1 తెలుగు పండిట్, SKPVV హిందూ హైస్కూలు

ప్రేమ ఆప్యాయతలతో
మాకు ఆదర్శంగా నిలిచి,
మా అభివృద్ధికి నిరంతరం
కృషి చేసిన మీరు మా నుండి
భౌతికంగా దూరం అయినా..
మీ జ్ఞాపకాలు మా నుండి
వీడిపోవు..

ఇట్లు
మీ కుటుంబ సభ్యులు

అంతిమయాత్ర : ది. 23-6-2025 సోమవారం ఉదయం 11 గం.కు చిట్టినగర్‌లోని మా స్వగృహము నుండి బయలుదేరును.

గంట అందజేస్తున్న దాతలు

బాలమ్మ గుడికి గంట బహూకరణ

ప్రజాశక్తి - కోడూరు : మండల పరిధిలోని లింగారెడ్డిపాలెం గ్రామ ప్రజలు ఇలవేల్పుగా పూజలు అందుకుంటున్న బాలమ్మ అమ్మవారికి కోడూరుకు చెందిన సీనియర్ పాత్రికేయులు చిట్టిప్రోలు వెంకట రామకృష్ణ - పద్మావతి దంపతులు నగారా గంటను బహూకరించారు. రూ.13,500 విలువచేసే ఎలక్ట్రికల్ గంట (నగారా గంట)ను రామకృష్ణ దంపతులు ఆలయ కమిటీ సభ్యులకు ఆదివారం అందించారు. ఆలయంలో జరిగే ధూప దీప నైవేద్యాలు సమర్పించే సమయంతో పాటు అమ్మవారికి హారతి ఇచ్చే సమయంలో ఈ నగారా గంటను వినియోగించుకున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. కమిటీ సభ్యులు గట్టా వెంకటేశ్వరరావు, అద్దంకి తిరుమలేశ్వరరావు, యాత్రికులు పాల్గొన్నారు.

అధికారులకు స్వాగతం, వీడ్కోలు

ప్రజాశక్తి - మొవ్వ : మొవ్వ మండల వ్యవసాయాధికారిగా కంచికచర్ల శివప్రసాద్ 8 సంవత్సరాలుగా రైతులకు అందించిన సూచనలు వెలకట్టలేనివని అతిథులు పేర్కొన్నారు. మొవ్వ మండల వ్యవసాయాధికారిగా 8 సంవత్సరాలు విధులు నిర్వహించి గన్నవరం మండల వ్యవసాయ అధికారిగా బదిలీ అయిన కంచర్ల శివప్రసాద్‌కు వీడ్కోలు, మొవ్వ మండల వ్యవసాయ అధికారిగా జిల్లా వ్యవసాయ కేంద్రం నుంచి విచ్చేసి బాధ్యతలు చేపట్టిన సురేష్ బాబు నాయక్ స్వాగతం పలికారు. ఆదివారం పెదసనగల్లు రోడ్డులోని కూచిపూడి పెదపూడి వర్తకసంఘ కళ్యాణమండపంలో గ్రామ వ్యవసాయ సహాయకుల ఆధ్వర్యంలో అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రైతులకు ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సూరపనేని శ్యామల, చల్లపల్లి ఏవో కె.మురళీకృష్ణ, జడ్పిటిసి రాజులపాటి పార్వతి, బార్లపూడి నీటి సంఘం అధ్యక్షులు తాతినేని పూర్ణచంద్రరావు, మండల వైసిపి అధ్యక్షుడు రాజులపాటి రాఘవరావు, ఫెర్టిలైజర్స్ యూనియన్ అధ్యక్షుడు దండమూడి వంశీకృష్ణ, మండలంలోని పిఎసిఎస్ లో సీఈవోలు, 16 సచివాలయాల వి.ఏ.ఏ.లు, రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శివప్రసాద్ దంపతులను శాల్వాలతో పూలదండలతో జ్ఞాపికలతో సత్కరించారు.

సంక్షేమ బోర్డులో 1214 జీవో రద్దు చేయాలి

మాట్లాడుతున్న బ్రహ్మచారి

ప్రజాశక్తి - గన్నవరం : కార్మిక సంక్షేమ బోర్డులో 1214 జీవో రద్దు చేసి, భవన నిర్మాణ కార్మికులకు పాత క్లైములన్నీ చెల్లించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు మోటమర్రి నాగ బ్రహ్మచారి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సంఘ కార్యాలయంలో మండల స్థాయి భవన నిర్మాణ కార్మిక సంఘం సమావేశం నిర్వహించారు. బ్రహ్మచారి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్న భవన నిర్మాణ కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదన్నారు. సంక్షేమ బోర్డులో కోట్ల రూపాయలు నిధులు ఉన్న పాత క్లైములు చెల్లించడానికి ముందుకు రాకపోవడం వల్ల భవన నిర్మాణ కార్మికులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో వందలాదిమంది కార్మికులు క్లైముల కోసం ఎదురుచూస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికైనా కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని సంక్షేమ బోర్డు నిధులు ఖర్చు పెట్టాలని కోరారు. భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా నాయకులు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ వచ్చే నెల 9వ తేదీన జిల్లాలోని అన్ని మండల రెవెన్యూ కార్యాలయాల వద్ద భవన నిర్మాణ కార్మికులు ఆందోళనలు చేయాలన్నారు. సంక్షేమ బోర్డు నిధులు కార్మికులకు చెల్లించాలని, లేబర్ కోడ్‌లు రద్దు చేయాలనే కేంద్ర ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా కార్మికులు ఉద్యమించాలన్నారు. అనంతరం మండల స్థాయి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. భవన నిర్మాణ కార్మిక సంఘం గన్నవరం మండల ప్రధాన కార్యదర్శిగా బి.శ్రీనివాసరెడ్డి అధ్యక్షులుగా శ్రీమన్నారాయణ, సహాయ కార్యదర్శులుగా చెరువుగట్టు ప్రసాద్, బ్రహ్మచారి ఉన్నారు.

అప్పులు కూడా పుట్టక అవస్థలు

బిల్లులు జమ చేయాలని మధ్యాహ్న భోజన కార్మికుల డిమాండ్

ప్రజాశక్తి - కోడూరు : అంగట్లో అప్పులు కూడా పుట్టక డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం కార్మికులైన వంట ఏజెన్సీ వారు అనేక అవస్థలు పడుతున్నారని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎం.డి కరిముల్లా అన్నారు. గత విద్యా సంవత్సరం నుంచి ఆగిన వేతనాలను, బిల్లులను వెంటనే జమ చేయాలని డిమాండ్ చేశారు. కోడూరులోని జిల్లా పరిషత్ హైస్కూల్ సందర్శించిన సిఐటియు నాయకులు వంట ఏజెన్సీ కార్మికులతో పెండింగ్లో ఉన్న వేతనాలు, బిల్లులు వారికున్న సమస్యల గురించి చర్చించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎండి కరిముల్లా మాట్లాడుతూ గత విద్యా సంవత్సరం జనవరి నుండి ఏప్రిల్ వరకు ఈ విద్యా సంవత్సరం జూన్ నుండి నేటి వరకు పెండింగ్లో ఉన్న వేతనాలను, బిల్లులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని వారితోపాటు స్కూల్స్‌లో స్వీపర్స్‌గా పనిచేస్తున్న కార్మికులకు గత సంవత్సరం ఫిబ్రవరి నుంచి పెండింగ్లో ఉన్న బిల్లులను వేతనాలను కూడా వెంటనే జమ చేయాలని డిమాండ్ చేశారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్నం భోజనం పథకానికి పనిచేస్తున్న వారి డొక్క నిండటం లేదని ప్రభుత్వం చర్యలు తీసుకుని ప్రతినెల 5వ తారీఖు జీతాలు ఇవ్వాలని ఎప్పటికప్పుడు బిల్లులు పెండింగ్ లేకుండా చూడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు సిరివెళ్ల రాజశేఖర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు శీలం నారాయణరావు, వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు పోలాబత్తిన మోహన్‌రావు, రైతు సంఘం నాయకులు ఆవుల బసవయ్య, ప్రజా సంఘం నాయకులు వాకా రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యను వివరిస్తున్నమధ్యాహ్న భోజన కార్మికులు

నేడు 'యువత పోరు'ను విజయవంతం చేయాలి : వైసిపి

పామర్రులో యువత పోరు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైసిపి నాయకులు

ప్రజాశక్తి - గుడ్లవల్లేరు : కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో నష్టపోయిన యువతరానికి మద్దతుగా, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ నెల 23న జరగనున్న 'యువత పోరు' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గుడ్లవల్లేరు మండలం వైసిపి యువజన విభాగ అధ్యక్షుడు గుదే రవి పిలుపునిచ్చారు. అనంతరం గుదే రవి మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో నిరుద్యోగ భృతిని విస్మరించిందని, దానిని తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఏడాది పాలనలో సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. 'ఇంటికో ఉద్యోగం లేదా నెలకు నిరుద్యోగ భృతి రూ.3 వేలు' ఇస్తామన్న హామీ కొండెక్కిందని విమర్శించారు. **పామర్రు :** 23న కృష్ణా జిల్లా మచిలీపట్నంలో నిర్వహించే వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ "యువత పోరు"ను జయప్రదం చేయ్యాలని పామర్రు మాజీ ఎంఎల్‌ఎ, వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి కైలె అనిల్ కుమార్ ఆదేశాల మేరకు ఆదివారం వైసిపి నాయకులు పోస్టరును ఆవిష్కరించారు. వైసిపి ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు, నిరుద్యోగులు, యువకులు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయవలసిందిగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆరేపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు. **పెనమలూరు :** యువత పోరు కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను నియోజకవర్గ వైసిపి కార్యాలయంలో ఆవిష్కరించారు. 3న కలెక్టర్‌కి వినతిపత్రం ఇచ్చే కార్యక్రమంలో యువకులు, నిరుద్యోగులు పాల్గొనాలని వైసిపి పెనమలూరు నియోజకవర్గ సమన్వయ కర్త దేవభక్తుని చక్రవర్తి పిలుపునిచ్చారు.

ఐటిఐ 2వ విడత అడ్మిషన్లకు దరఖాస్తులు

ప్రజాశక్తి - గుడివాడ : కృష్ణాజిల్లాలో గల ప్రభుత్వ, ప్రైవేటు ఐటిఐ కళాశాలలో మిగిలి ఉన్న సీట్లకు రెండో విడత అడ్మిషన్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కె.బి.ఆర్ గవర్నమెంట్ ఐటిఐ కళాశాల ప్రిన్సిపల్/కన్వీనర్ ఓ.మంజులా దేవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా 10వ తరగతి, 8వ తరగతి పాసైన యువతి యువకులు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని పేర్కొన్నారు. ఐటిఐ.ఎపి.జిఓవి.ఇన్ ఆన్లైన్ ద్వారా జులై 15వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని, సర్టిఫికెట్లు వెరిఫికేషన్‌కు ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో తమ దగ్గరలో ఉన్న గవర్నమెంట్ ఐటిఐలో జులై 7 తేదీలోపు వెరిఫికేషన్ చేయించుకోవాలని చెప్పారు. పూర్తి వివరాలకు 08674-295953, 8297574757 నెంబర్లను సంప్రదించాలని ప్రిన్సిపల్ ఓ మంజులాదేవి ప్రకటనలో కోరారు.

తేనెటీగల దాడిలో 30 మందికి గాయాలు

ప్రజాశక్తి - గన్నవరం : స్థానిక శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో తేనె టీగల దాడిలో పలువురు యాత్రికులు గాయపడిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆలయ ప్రాంగణంలోని రేగు చెట్టుపై తేనె టీగలు కొండ తెర పెట్టాయి. గుడికి యాత్రికులు అధికంగా వస్తుంటారు. అయితే కొండ తెరను చూసి భయపడుతున్నారు. కొండతెరను తొలగించాలని ఆలయ అధికారులకు చెప్పినా పట్టించుకోలేదు. ఆలయ ప్రాంగణంలో చెట్లు కూడా విపరీతంగా పెరిగాయి. దేవాలయ శాఖ ఇఒ పర్యవేక్షణ, పరిశీలనా లేదంటున్నారు. ఈ క్రమంలో తేనెటీగలు దాడి చేయడంతో 30 మంది గాయపడి ఆసుపత్రిలో వైద్యం చేయించుకున్నట్లు స్థానికులు చెప్పారు. ఈ విషయం తెలుసుకున్న ఆలయ కార్యనిర్వాహణాధికారి ఎం.తేజ శనివారం కొండతెర తొలగింపజేశారు. దీంతో యాత్రికులు ఊపిరి పీల్చుకున్నారు.



వెంకట్‌ను సన్మానిస్తున్న దృశ్యం

హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ సేవలకు గుర్తింపు

ప్రజాశక్తి : గన్నవరం : వికలాంగుల అభివృద్ధి సంక్షేమానికి కృషి చేస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ చైర్మన్ సంకాబత్తుల వెంకట్ సేవలు గుర్తించి అఖిల భారత సంస్థ సక్షమ్ సంస్థ వ్యవస్థాపక దినోత్సవ కార్యక్రమంలో ఆదివారం ఆయనను సత్కరించారు. ఈ సందర్భంగా హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ చైర్మన్ సంకాబత్తుల వెంకట్ మాట్లాడుతూ వికలాంగులకు స్పందన మానసిక వికాస కేంద్రాన్ని ఏర్పాటు చేసి ఉచితంగా విద్యా వైద్య రవాణా భోజన సౌకర్యాన్ని అందిస్తున్నామని ఆయన అన్నారు. అఖిలభారత సంస్థ అయినా సక్షమ్ అందించిన సత్కారానికి మరింత బాధ్యత పెంచిందని తద్వారా మరిన్ని సేవలను విస్తరిస్తామని వెంకట్ తెలిపారు. సక్షమ్ ఆంధ్రప్రదేశ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ వై.కృష్ణమోహన్ మాట్లాడుతూ వికలాంగుల వికాసం, సంక్షేమం, సాధికారిత కోసం 20 జూన్ 2008న నాగపూర్‌లో ప్రారంభమై దేశవ్యాప్తంగా ఉన్న కోట్లాదిమంది వికలాంగులను దేశ సమగ్రాభివృద్ధిలో భాగస్వాములను చేసేందుకు, వికలాంగుల ఆత్మగౌరవంతో జీవించేందుకు 'సక్షమ్' కృషిచేస్తుందని ఆయన అన్నారు. అనంతరం వికలాంగులకు ట్రైసైకిళ్లు, పరికరాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ సక్షమ్ సంస్థ వైస్ ప్రెసిడెంట్ ఎ.వి.యస్ మూర్తి ఉమ్మడి కృష్ణా జిల్లా కార్యదర్శి గీత, శ్రీలక్ష్మి, వికలాంగులు ఉద్యోగులు పాల్గొన్నారు.

యోహాన్ పుట్టినరోజు వేడుకల్లో ఎంఎల్ఎ

ప్రజాశక్తి మొవ్వ : మొవ్వ మండల తహ శీల్దార్ కె.మస్తాన్ మనవడు యోహాన్ పుట్టిన రోజు వేడుకలకు పామర్రు ఎంఎల్ఎ వర్ల కుమార్ రాజా, అధికార పార్టీ నేతలు హాజరయ్యారు. విజయవాడలో ఆదివారం నిర్వహించిన వేడుకల్లో ఆయనతో పాటు మండల టిడిపి అధ్యక్షుడు లింగమనేని రామలింగేశ్వరరావు, మాజీ అధ్యక్షుడు మండవ శ్రీకృష్ణ, కృష్ణా జిల్లా టిడిపి ఉపాధ్యక్షులు నన్నపనేని వీరేంద్ర, మొవ్వ ఏఎంసి మాజీ చైర్మన్ మండవ రత్నగిరి, యద్దనపూడి మాజీ సర్పంచ్ యద్దనపూడి రాఘ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు వైసిపి 'యువత పోరు' ధర్నా

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : టిడిపి కూటమి ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ విజయవాడ ధర్నా చౌక్‌లో సోమవారం యువత పోరు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైసిపి పశ్చిమ ఇన్చార్జ్ వెలంపల్లి శ్రీనివాసరావు పేర్కొన్నారు. వన్‌టౌన్ బ్రాహ్మణ వీధిలోని వైసిపి పశ్చిమ కార్యాలయంలో యువత పోరు పోస్టర్‌ను యువజన విభాగ నాయకులతో కలిసి వెలంపల్లి శ్రీనివాసరావు ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెలంపల్లి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్నా నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయలేదని దుయ్యబట్టారు. ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన విధంగా నిరుద్యోగులకు నెలకు మూడు వేల రూపాయలు భృతి తక్షణమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. యువత పోరును విజయవంతం చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో వైసిపి పశ్చిమ నియోజకవర్గ యువజన విభాగ అధ్యక్షుడు కేసరి రాజశేఖర్ రెడ్డి, పలు అనుబంధ విభాగ నాయకులు పాల్గొన్నారు.

దేవినేని నెహ్రూ జయంతి వేడుకలు

ప్రజాశక్తి - విజయవాడ : విజయవాడ తూర్పు నియోజకవర్గంలోని 15వ డివిజన్ పార్టీ కార్యాలయంలో ఆదివారం మాజీ మంత్రి దేవినేని రాజశేఖర్ (నెహ్రూ) జయంతి వేడుకలు జరిగాయి. నగర డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, మాజీ డిప్యూటీ మేయర్ ఆళ్ల చెల్లారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో ముందుగా దేవినేని నెహ్రూ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం స్వీట్లు పంచి, కేక్ కటింగ్ చేశారు. దేవినేని నెహ్రూ నగరాభివృద్ధికి చేసిన సేవల గురించి, రాజకీయాల్లో ఆయన పాత్ర గురించి డిప్యూటీ మేయర్ వివరించారు. ఈ కార్యక్రమంలో ఎం.ఎస్ రాజు, మోహన్ రావు, చిన్న, కలాం పాల్గొన్నారు.

26 నుండి ఇంద్రకీలాద్రిపై వారాహి నవరాత్రులు

ఏర్పాట్లకు ఇఒ ఆదేశాలు

ప్రజా శక్తి - విజయవాడ సిటీ : దుర్గా మల్లేశ్వర స్వామి వారి దేవస్థానం ఇంద్రకీలాద్రిపై ఈ నెల 26 నుంచి జూలై 4వ తేదీ వరకు వారాహి అమ్మవారి నవరాత్రుల ఉత్సవాలను నిర్వహిస్తున్నామని దేవస్థాన కార్యనిర్వహణాధికారి వికె శీనా నాయక్ తెలిపారు. అందుకు తగిన ఏర్పాట్లు పూర్తి చేయాలని దేవస్థానం వివిధ విభాగాలకు చెందిన అధికారులకు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 26 నుంచి జూలై 27 వరకు ఆషాడ మాసం సందర్భంగా అమ్మవారికి ఆషాడం సారె సమర్పణ కార్యక్రమాలను నిర్వహిస్తామని ఇఒ శీనా నాయక్ తెలియజేశారు.

ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఇఒ శీనా నాయక్

నలందలో యోగా వేడుకలు

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : నలంద డిగ్రీ కళాశాల ఎన్‌సిసి 17(ఎ) బెటాలియన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు ఆదివారం నగరంలోని అంబేద్కర్ స్మృతి వనం వద్ద ఘనంగా జరిగాయి. 1100 మందికి పైగా ఎన్‌సిసి క్యాడెట్లు, నావెల్ యూనిట్ సభ్యులు పాల్గొని యోగా విన్యాసాలను, యోగా విశిష్టత గురించి తెలియచేశారు. బెటాలియన్ కమాండర్ లెఫ్టినెంట్ కల్నల్ జి.సి.పాండే ఈ కార్యక్రమానికి నాయకత్వం వహించి యోగా దినోత్సవ వేడుకల నిర్వహణకు, క్యాడెట్లుకు తగిన సూచనలు, సలహాలు అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రోజు 30 నిమిషాలు యోగా చేయాలని, నిత్య జీవనంలో యోగా భాగం కావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నలంద డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.అనురాధ, ఎఎన్‌ఒ కె.సుధాకర్, పలు కళాశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్లో గ్రీవెన్స్ : కలెక్టర్

ప్రజాశక్తి - విజయవాడ : కలెక్టరేట్ లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టం) కార్యక్రమం ద్వారా ప్రజల నుండి వినతులు స్వీకరిస్తామని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్, డివిజన్, మునిసిపల్, మండల కేంద్రాల్లో సంబంధిత అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి అర్జీలు స్వీకరిస్తారని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. అలాగే అర్జీదారులు తమ అర్జీలను Meekosam.ap.gov.in వెబ్సైట్లో నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు. నమోదైన అర్జీల స్థితి, సంబంధిత సమాచారం తెలుసుకునేందుకు 1100 కి నేరుగా కాల్ చేయవచ్చని పేర్కొన్నారు.

హెచ్ఎంలు, ఎంఇఒల సమావేశం

ప్రజాశక్తి- నందిగామ : జిల్లాలోని ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖాధికారుల సర్వసభ్య సమావేశం, ఆత్మీయ సమావేశం నందిగామ తేజ డివిఆర్ కళాశాలలో జరిగింది. ఈ సమావేశంలో ఎన్టీఆర్ జిల్లాకు బదిలీపై వచ్చిన, ప్రమోషన్‌పై నూతనంగా చేరిన ప్రధానోపాధ్యాయులకు స్వాగతం పలికి అభినందించారు. ఈ విద్యా సంవత్సరంలో ప్రధానోపాధ్యాయులు నిర్వహించాల్సిన వివిధ కార్యక్రమాలు, అకాడమీ క్యాలెండర్‌పై అవగాహన కల్పించారు. యాప్ వినియోగంపై అవగాహన, కొత్తగా ప్రవేశపెట్టిన హిట్ కార్యక్రమం, నో బ్యాగ్ డే రోజు నిర్వహించాల్సిన కార్యక్రమాలు, విద్యార్థులకు కొత్తగా ప్రవేశపెట్టిన అస్సైన్మెంట్ బుక్ వినియోగం, ఇతర అంశాలపై నిపుణులైన ప్రధానోపాధ్యాయులు క్షుప్తంగా వివరించారు. సంఘం బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. జిల్లా ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారుల అధ్యక్షులు ఆర్.రాంబాబు నాయక్, ఈఎవోస్ కేశవరావు, ప్రధాన కార్యదర్శి, అధ్యక్షులు ప్రసాద్, కోశాధికారి సిహెచ్ వెంకట్ నారాయణ, స్టేట్ కౌన్సిలర్లు సుధాకర్, నోముల శ్రీనివాస్, సీనియర్ ప్రధానోపాధ్యాయులు ఆళ్ల రాంబాబు, మండల విద్యాశాఖ అధికారులు పద్మ, కెనడి, శ్యాంబాబు తదితరులు పాల్గొన్నారు.



ఎంఎల్ఎ సుజనాకు డాక్టర్ మరుపిళ్ల పరామర్శ

ప్రజా శక్తి - విజయవాడ సిటీ : విజయవాడ పశ్చిమ ఎంఎల్ఎ యలమంచిలి సుజనా చౌదరిని నగరాల దేవస్థానం కమిటీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మరుపిళ్ళ హనుమంతరావు పరామర్శించారు. ఆదివారం హైదరాబాదులోని సుజనా నివాసంలో ఆయనను కలిసి నగరాల సీతారామస్వామి, శ్రీ మహాలక్ష్మి అమ్మవారి ఆశీస్సులను అందజేశారు.

మంచినీటి ట్యాంకర్‌ను ప్రారంభిస్తున్న తన్నీరు నాగేశ్వరరావు

ముండ్లపాడులో మంచినీటి ట్యాంకర్ ప్రారంభం

ప్రజాశక్తి - వత్సవాయి : పెనుగంచిప్రోలు మండలం ముండ్లపాడు గ్రామంలో ఎన్ఆర్ఐ ఈపూరి రవీంద్ర రెడ్డి సౌజన్యంతో వైసిపి ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన మంచినీటి ట్యాంకర్‌ను స్థానిక నాయకులతో కలిసి పార్టీ జగ్గయ్యపేట నియోజకవర్గ ఇన్చార్జి తన్నీరు నాగేశ్వరరావు ప్రారంభించారు. ఈసందర్భంగా తన్నీరు మాట్లాడుతూ మంచినీటి ట్యాంకర్‌ను ప్రారంభించడం శుభదాయకమన్నారు. గ్రామంలో ప్రజలందరి దాహార్తి తీర్చేందుకు దీనిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం రవీంద్ర రెడ్డికి శాలువా కప్పి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈకార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు పొన్నం కోటేశ్వరరావు, గ్రామ అధ్యక్షులు నర్మనేని మధుసూదన్ రెడ్డి, రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి బత్తుల రామారావు, ఉపాధ్యక్షులు కొత్తపల్లి పెంటయ్య, నారాయణరెడ్డి, నంబూరు రవి, మన్నె అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

రావూరి లక్ష్మికి మున్సిపల్ చైర్‌పర్సన్ నివాళి

ప్రజాశక్తి- నందిగామ : టిడిపి ముప్పాళ్ళ గ్రామ సీనియర్ నాయకులు రావూరి సాయి సతీమణి రావూరి లక్ష్మీ చిత్రపటానికి మున్సిపల్ చైర్మన్ మండవ కృష్ణ కుమారి తదితరులు పూలమాలు వేసి నివాళు లర్పించారు. ఈకార్యక్రమంలో నందిగామ గవర్నమెంట్ హాస్పిటల్ చైర్మన్ వేపూరి నాగేశ్వరరావు, టిడిపి సీనియర్ నాయకులు అనుమోలు కిషోర్, యన్నద్రపల్లి శ్రీనివాసరావు, కొండూరు వెంకటరమణ, రాటకొండ రమణ పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్మన్ మండవ కృష్ణ కుమారి తదితరులు

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

ప్రజాశక్తి - విజయవాడ : జిల్లా పోలీసు కమిషనరేట్ పరిధిలోని అన్నీ పోలీసుస్టేషన్లు, టాస్క్‌ఫోర్స్ కార్యాలయాల్లో ఆదివారం ఆయా పోలీసు అధికారులు తమ సిబ్బందితో కలిసి రౌడీషీటర్‌లకు, లా అండ్ ఆర్డర్, క్రైమ్ సస్పెక్ట్‌లకు, చెడునడత కలిగిన వ్యక్తులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈసందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఎలాంటి నేరాలకు పాల్పడకుండా నేర ప్రవృత్తిని మాని మంచి నడవడికతో, సత్ప్రవర్తనతో మెలగాలని, ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలలో పాల్గొవడం చేయరాదని, ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల వినియోగం, అక్రమ రవాణా చేయకుండా సత్ప్రవర్తన మార్గంలో నడవాలని, ప్రతి ఒక్కరు చెడు వ్యసనాలను దూరం చేసుకుని మంచి ప్రవర్తనతో మెలగాలని సూచించారు. ప్రతి ఒక్కరిపై పోలీస్ వారి నిఘా ఉంటుందని తెలిపారు. ఎవరైనా ఎక్కడైనా గొడవలు, ఇతర నేరాలలో పాల్గొంటే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కార్పొరేటర్ యరడ్లను కలిసిన నేతలు

ప్రజాశక్తి- విజయవాడ సిటీ : స్థానిక భవానీపురం గాంధీబొమ్మ వీధిలోని కార్పొరేటర్ కార్యాలయంలో ఇటీవల నూతనంగా నియమితులైన వైసిపి రాష్ట్ర ఐటి విభాగం జాయింట్ సెక్రెటరీ దొడ్డ రాజశేఖర్ రెడ్డి, రాష్ట్ర మైనారిటీ సెల్ జాయింట్ సెక్రటరీ షేక్ బడేమియా 40వ డివిజన్ కార్పొరేటర్ యరడ్ల ఆంజనేయరెడ్డిని కలిసి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఆంజనేయరెడ్డి వారిని శాలువాతో సన్మానించారు. ఈకార్యక్రమంలో వైసిపి రాష్ట్ర బూత్ కమిటీ ప్రధాన కార్యదర్శి కేసరి కస్తూరెడ్డి తదితరులు పాల్గొన్నారు

ఘనంగా గుడ్లవల్లేరు శేషాద్రి ఇంజినీరింగ్ కళాశాల స్నాతకోత్సవం

సర్టిఫికెట్లు అందుకుంటున్న విద్యార్థులు

ప్రజాశక్తి - గుడ్లవల్లేరు : స్థానిక శేషాద్రి రావు గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాలలో 24వ స్నాతకోత్సవ వేడుక ను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సుప్రీంకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ నూతలపాటి వెంకటరమణ ముఖ్య అతిథిగా విచ్చేశారు. సివిల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మిషీన్ లెర్నింగ్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ డేటా సైన్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ విభాగాలలో ఇంజనీరింగ్ విద్యను పూర్తిచేసిన విద్యార్థులకు ప్రొవిజనల్ సర్టిఫికెట్లు అందజేశారు. ఇంజనీరింగ్ విద్యార్థులను పట్టబద్రులుగా ధ్రువీకరించే ఈ కార్యక్రమంలో 1165 మంది విద్యార్థులు హాజరై ప్రొవిజనల్ సర్టిఫికెట్లను ముఖ్య అతిథి జస్టిస్ నూతలపాటి వెంకటరమణ చేతుల మీదుగా ఆయా విభాగాల విభాగాధిపతులు, అధ్యాపకుల సమక్షంలో అందుకున్నారు. రెండు దశాబ్దాలుగా విభిన్న నేపథ్యాల నుండి వచ్చిన వేలాది మంది విద్యార్థులకు సాంకేతిక నైపుణ్యాలు, ఉద్యోగ భద్రతను కల్పించి సమాజనికి సాంకేతిక శక్తి కలిగిన ఉత్తమ పౌరులను అందిస్తున్నట్లు కళాశాల ఛైర్మన్ వల్లూరుపల్లి నాగేశ్వర రావు తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బుర్రా కరుణకుమార్ ప్రారంభోపన్యాసంలో 2025వ సంవత్సరంలో అన్ని విభాగాల్లో మొత్తం 1415 విద్యార్థులు పట్టభద్రులయ్యారన్నారు. కొమ్ము సుప్రియ (9.65), గంజి స్నేహలత (9.52), ఈలపర్తి ప్రియాంక (9.51) అకడమిక్ టాపర్స్‌గా నిలవడం విశేషమన్నారు. 33 మంది విద్యార్థులు ఆనర్స్ డిగ్రీ పూర్తి చేయగా, 17 మంది విద్యార్థులు మైనర్స్ డిగ్రీ పూర్తి చేసి అదనంగా 18 క్రెడిట్స్ సాధించటం అభినందనీయమన్నారు. జస్టిస్ నూతలపాటి వెంకటరమణ ప్రసంగిస్తూ కళాశాల విద్యను పూర్తి చేసి, బాహ్య ప్రపంచంలోకి, వృత్తిలోకి అడుగుపెట్టేందుకు ఉద్యుక్తులైన మీరందరూ ముందుగా మీ శక్తి- యుక్తులను, సామర్థ్యాలను, సమాజానికి ఇచ్చిన వాగ్దానాన్ని గుర్తించుకోవాలన్నారు. భారతదేశం వ్యవసాయ ఆధారిత ఆర్థిక వ్యవస్థ నుండి సేవాధారిత ఆర్థిక వ్యవస్థకు మారడం 20వ శతాబ్దం చివరిలో అత్యంత ముఖ్యమైన ఆర్థిక పరివర్తనలో ఒకటని జస్టిస్ డాక్టర్ ఎన్.వి. రమణ గుర్తు చేశారు. కళాశాల ఆయా విభాగాధిపతులు ప్రొవిజనల్ సర్టిఫికెట్లను అందజేశారు. అనంతర నూతలపాటి వెంకటరమణను జ్ఞాపిక, దుశ్శాలువాతో సత్కరించి సన్మాన పత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు వల్లూరుపల్లి వెంకట కిరణ్, ముసునూరి శ్రీరామ్ ,వల్లభనేని సుబ్బారావు, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ పి.కోదండ రామారావు, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి గుడ్లవల్లేరు తహశీల్దార్ బి.లోకరాజ్, కృష్ణ జిల్లా న్యాయమూర్తి, గుడివాడ సివిల్ కోర్ట్ న్యాయమూర్తి, విజయ డైరీ చైర్మన్ చలసాని ఆంజనేయులు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఉమామహేశ్వరరావు తదితరులు హాజరయ్యారు.

బాధిత కుటుంబానికి లంకిశెట్టి ఫ్రెండ్స్ సర్కిల్ సహాయం

ప్రజాశక్తి - మచిలీపట్నం అర్బన్ , గూడూరు : పెడన నియోజకవర్గం గూడూరు మండలం పోలవరం గ్రామంలో గత వారం జరిగిన అగ్నిప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన బాధిత కుటుంబానికి ఆదివారం లంకిశెట్టి బాలాజీ ఫ్రెండ్ సర్కిల్ ఆధ్వర్యంలో సహాయం చేశారు. పోలవరానికి చెందిన మురాల లక్ష్మీకుమారి(60) ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో జూన్ 17 తెల్లవారుజామున మంటలు రేగాయి. ఈ ప్రమాదంలో 30,000 నగదు ఇతర విలువైన వస్తువులు సామాన్లు ఇంటిదస్తావేజులతో సహా సర్వస్వం కాలిపోయాయి. లక్ష రూపాయలకు పైగా ఆర్థిక నష్టం వాటిల్లింది. మొవ్వ ఫైర్ స్టేషన్ సిబ్బంది చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. కష్టంలో ఉన్న మురాల లక్ష్మి కుమారికి ఆదివారం లంకిశెట్టి ఫ్రెండ్స్ సర్కిల్ తరఫున వంట సామాన్లు, చీరలు, నిత్యావసర వస్తువులు, రూ.2వేలు ఆర్థిక సహాయాన్ని లంకిశెట్టి బాలాజీ అందించారు. ఈ సందర్భంగా బాలాజీ మాట్లాడుతూ అగ్నిప్రమాద బాధితులకు ఇచ్చే ప్రభుత్వ సహాయం రూ.5 వేల నుండి రూ.లక్షకు పెంచాలని జిల్లా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ గృహ నిర్మాణ సంస్థ ద్వారా తాత్కాలిక ఇంటి నిర్మాణం కోసం ఆర్థిక సహాయం అందజేయాలని బాలాజీ కోరారు. మండల కేంద్రమైన గూడూరులో ఫైర్ స్టేషన్ అవసరం ఎంతైనా ఉందని బాలాజీ అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ అడపా మురళి, కూతని ఈశ్వర రామాంజనేయులు, సీతంశెట్టి పవన్ తదితరులు పాల్గొన్నారు.

హరికృష్ణ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - కంకిపాడు : రాష్ట్ర డాక్యుమెంట్ రైటర్ అధ్యక్షులు టిడిపి సీనియర్ నాయకుడు తుమ్మలపల్లి హరికృష్ణ పుట్టినరోజు వేడుకలు కంకిపాడులో ఘనంగా జరిగాయి. స్థానిక సినిమాహాలు సెంటరులోని టిడిపి కార్యాలయంలో కూటమి నాయకులు అధ్వర్యంలో పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్ తనయుడు వెంకట్రామ్ కేక్ కట్టింగ్ నిర్వహించి హరికృష్ణకు బర్త్ డే విషెష్ తెలిపారు. ఆర్థిక, రాజకీయ, సామాజిక సేవా రంగాల్లో హరికృష్ణ ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షిస్తూ బర్త్ డే విషెష్ తెలిపిన కంకిపాడు ఉప సర్పంచ్ రాచూరి చిరంజీవి ఈ కార్యక్రమంలో సీనియర్ తెలుగుదేశం నాయకులు వీరంకి గురుమూర్తి, కంకిపాడు గ్రామ పార్టీ అధ్యక్షుడు చిట్టూరి నాగేశ్వరావు, ఏనుగు జయ, పులి శ్రీను, చిట్టూరి కోటయ్య బాబు, కంకిపాటి రమేష్, బాకీ రాజు, దిమ్మిటి శివ, నాగ శ్రీ, శివపార్వతి, మునిస్వామి, తదితరులు పాల్గొని హరికృష్ణకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

ఫ్రీజర్ బాక్స్ వితరణ

ప్రజాశక్తి - ఉంగుటూరు : మండలంలోని పొనుకుమాడు గ్రామపంచాయతీకి రూ.80వేలు విలువగల ఫ్రీజర్ బాక్స్‌ను గ్రామానికి చెందిన చెరుకూరి భానుమతి, కుటుంబ సభ్యులు ఆదివారం సర్పంచ్ అన్నే సుబ్బలక్ష్మికి అందజేశారు. ఈ సందర్భంగా సుబ్బలక్ష్మి మాట్లాడుతూ గ్రామంలో అత్యధికమంది బడుగు బలహీన వర్గాలకు చెందిన కుటుంబాల వారు ఎక్కువని ఇక్కడ చదువుకుని ఉపాధి అవకాశాల కోసం ఇతర ప్రాంతాల్లో నివాసం ఉండి జీవనోపాధి సాగిస్తున్న వారు ఎక్కువ ఉన్నారని గ్రామంలో వారికి సంబంధించిన బంధువులు ఎవరైనా కాలం చేస్తే భౌతిక కాయాన్ని నిలవ ఉంచడానికి ఫ్రీజర్ బాక్స్‌కు అత్యధిక మెత్తంలో అద్ద చెల్లించడం కష్టంగా ఉందని అలాంటి

కుటుంబాలకు భానుమతి వారి కుటుంబీకుల సహకారం మరువలేనిదని అన్నారు. వారికి గ్రామ పంచాయతీ నుంచి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దాతలు చెరుకూరి భానుమతి, కుటుంబ సభ్యులు, గ్రామ మాజీ సర్పంచ్ చింతల శ్రీనివాసరావు గ్రామస్తులు పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి

ట్రోఫీలు, బహుమతులు అందుకున్న క్రీడాకారులు

ప్రజాశక్తి - అవనిగడ్డ : యువత క్రీడల్లో జాతీయ అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని నియోజకవర్గ యువ నాయకులు మండలి వెంకట్రాం కోరారు శనివారం సాయంత్రం మండల పరిధిలోని మోదుమూడి గ్రామంలో నిర్వహించిన బోదుమూడి ప్రీమియర్ లీగ్ సీజన్ 2 ఫైనల్ మ్యాచ్ బహుమతి ప్రదానోత్సవం జరిగింది. ప్రశాంత్ టీం చెరుకుపల్లి గణేష్‌కి మధ్య పోరా హోలీపూర్‌లో ఫైనల్ మ్యాచ్ టై కావడంతో సూపర్ ఓవర్ నిర్వహించగా చెరుకుపల్లి గణేష్ టీం విజేతగా నిలిచారు. ఈ టోర్నమెంట్ విన్నర్ చెరుకుపల్లి గణేష్ టీం జట్టుకు నియోజకవర్గ యువ నాయకులు వెంకట్ రామ్ ట్రోఫీ బహూకరించారు. విద్యానికేతన్ విద్యాసంస్థల అధినేత అశ్వరావుపాలెం సర్పంచ్ పంద్రాజు లంకమ్మ ప్రసాద్ రూమ్ 30 వేల నగదు బహుమతి అందజేశారు. రన్నర్‌గా నిలిచిన గోధుమూడి ప్రశాంత జట్టుకు వెంకట్రాం ట్రోఫీ అందజేయగా జనసేన మండల పార్టీ అధ్యక్షులు గుడివాడ శేషుబాబు రూ 20వేల నగదు బహుమతిని అందజేశారు. మూడో స్థానంలో నిలిచిన పులిగడ్డ జట్టుకు అందజేయగా మోదుమూడి గ్రామ జనసేన పార్టీ అధ్యక్షులు బచ్చు వెంకట్ నారాయణ రూపదివేల నగదు బహుమతిని అందజేశారు. నాలుగో స్థానంలో నిలిచిన టీ కొత్తపాలెం జట్టుకు ప్రభుత్వ వైద్యశాల డైరెక్టర్ బచ్చు కృష్ణకుమారి రూ.5 వేల నగదు బహుమతి అందజేయగా విజేత జట్టులకు క్రీడాకారులకు ఎంపిటిసి సభ్యులు కటికల వసంత్ ఆర్థిక సహకారం రూ.పదివేలతో ట్రోఫీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా కార్యదర్శి గాజుల శంకర్రావు గ్రామ సర్పంచ్ బచ్చు బేబీ మత్తు శివ పార్వతి బొప్పన పృథ్వీ పాల్గొనగా బచ్చు ప్రశాంత్ ఆధ్వర్యంలో బచ్చు కిరణ్ తేజ ఆధూరి గణేష్ మతి రాజేష్ ఆదోరి అరుణ్ సింగం గోపి బచ్చు రామాంజనేయులు బచ్చు రాము బచ్చు సుధీర్ పర్యవేక్షించారు.

వాహనం ఢీకొని మహిళ మృతి

ప్రజాశక్తి - పామర్రు : శనివారం రాత్రి 8 గంటల సమయంలో పామర్రు వైపు నుండి విజయవాడ వైపు వెళుతున్న నేషనల్ హైవే రోడ్డు మీద కురుమద్దాలి ఫ్లైఓవర్ దగ్గర గుర్తుతెలియని వాహనం ఢీకొన్న సంఘటనలో

సుమారు 50 సంవత్సరాల వయసు కలిగిన గుర్తు తెలియని మహిళలు అక్కడికక్కడే మరణించినట్లు పామర్రు ఎస్ఐ వి.రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఆమెను గుర్తించిన వారు పామర్రు పోలీసు ఫోన్ నెంబర్ 9440796431కు తెలియజేయాలని కోరారు. ఈ ఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మాజీ జడ్‌పిటిసి రామకోటి వర్ధంతి

ప్రజాశక్తి - అవనిగడ్డ : అవనిగడ్డ మాజీ జడ్పిటిసి అడపా రామ కోటేశ్వరరావు వర్ధంతిని ఆదివారం వైసిపి కార్యాలయం వద్ద నిర్వహించారు. రామకోటేశ్వరరావు చిత్రపటానికి మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు పరుచూరి గోవర్ధన పూలదండలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ వైసిపి నాయకులు సింహాద్రి వికాస్ జడ్పిటిసి చింతలపూడి లక్ష్మీనారాయణ జిల్లా పంచాయతీరాజ్ విభాగం పార్టీ అధ్యక్షులు సింహాద్రి వెంకటేశ్వరరావు, ట్రేడ్ యూనియన్ నాయకులు గార్లపాటి గోపి తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ నారాయణకు పరామర్శ

ప్రజాశక్తి - అవనిగడ్డ : మాజీ సర్పంచ్ అద్దంకి నారాయణను పరామర్శించిన విక్కుర్తి రామచంద్రపురం మాజీ సర్పంచ్ టిడిపి నాయకులు అద్దంకి నారాయణరావును ప్రముఖ పారిశ్రామికవేత్త విక్కుర్తి వెంకట శ్రీనివాసరావు పరామర్శించారు. నారాయణరావు ఇటీవల గుండెకు సంబంధించిన శస్త్ర చికిత్స చేయించుకున్నారు. దీనితో ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్న నారాయణరావును రామచంద్రపురం పంచాయతీ పరిధిలోని వల్లందపాలెం వారి స్వగృహానికి వెళ్లి నారాయణరావును పరామర్శించి వారి ఆరోగ్య విషయాలు అడిగి తెలుసుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసరావు సోదరుడు విక్కుర్తి రాంబాబు న్యాయవాది విక్కుర్తి రామకృష్ణ పులిగడ్డ శ్రీరామచంద్రమూర్తి రేపల్లె ముసలయ్య వర్మ బుజ్జి ఎస్.పున్నయ్య చౌదరి తదితరులు పాల్గొన్నారు.

అద్దంకి నారాయణరావును పరామర్శిస్తున్న విక్కుర్తి శ్రీనివాసరావు ఆయన మిత్రులు

మోపిదేవి ఆలయానికి పోటెత్తిన యాత్రికులు

ప్రజాశక్తి - మోపిదేవి : మోపిదేవిలో ప్రముఖ పుణ్యక్షేత్రం సుబ్రహ్మణ్యేశ్వర స్వామి సేవలో యాత్రికులు పాల్గొన్నారు. సుమారు 1119 మంది స్వామివారి దర్శనం చేసుకున్నట్లు ఆదివారం ఒక్కరోజే 10,51535 రూపాయిలు ఆదాయం వచ్చినట్లు ఆలయ సంయుక్త కమిషనర్ కార్యనిర్వహణ అధికారి దాసరి శ్రీరామ వరప్రసాదరావు తెలియజేశారు అన్నదానం కోసం యాత్రికులు రూ.15,148లు విరాళాలుగా సమర్పించారు. శాశ్వత, నిత్య అన్నదాన కార్యక్రమం నిమిత్తం - 85,364 రూపాయలు విరాళాలుగా వచ్చాయి. స్వామి వారి కళ్యాణ కట్ట టిక్కెట్ల ద్వారా వచ్చిన -రూ.24వేలు ప్రసాదం (లడ్డు- పులిహోర) విక్రయం ద్వారా -1,66,625 రూపాయలు, స్వామి దర్శనం ద్వారా వచ్చిన రుసుము- 76,350 రూపాయలు. స్వామి వారికి సేవా టిక్కెట్ల ద్వారా వచ్చిన రుసుమ -6,83,898 రూపాయలు మొత్తం ఆలయం ఆదాయం రుసుము రూపంలో -10,51,535 రూపాయలు వచ్చినట్లు అధికారులు ప్రకటించారు.

మంటలు అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

కెనరా బ్యాంకులో విద్యుదాఘాతం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : పట్టణంలో కోదాడ రోడ్డులో గల కెనరా బ్యాంక్‌లో ఆదివారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో బ్యాంకులో గల మెటీరియల్ దగ్ధమైనట్టు తెలుస్తుంది. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలం వద్దకు వచ్చి మంటలను అదుపు చేశారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య వెంటనే సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా బ్యాంకు సిబ్బందితో మాట్లాడి, దగ్ధానికి కారణాలు, నష్టంపై వివరాలు తెలుసుకున్నారు. ప్రమాదం జరిగిన తీరును అధికారులు వివరించగా, బాధితులకు అవసరమైన సహాయం అందించాలని సంబంధిత శాఖలకు సూచించారు. తక్షణమే స్పందించి ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేసిన జగ్గయ్యపేట ఫైర్ సిబ్బందిని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య ప్రత్యేకంగా అభినందించారు.

నీట్ ర్యాంకర్‌కు అభినందన

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : ఆలిండియా మెడికల్ ఎంట్రన్స్ నీట్ పరీక్ష ఫలితాల్లో జగ్గయ్యపేట విద్యార్థి వడ్డేపల్లి యజ్ఞేశ్వర్ ఆలిండియా ఓపెన్ కేటగిరిలో 2168, ఒబిసి కేటగిరిలో 741ర్యాంక్ సాధించాడు. 590/ 720 మార్కులతో, 99.89 పర్సంటైల్‌తో ఈ ఘనత సాధించాడు. యజ్ఞేశ్వర్ 1 నుండి 10వ తరగతి వరకు జగ్గయ్యపేట చేగు విద్యాలయంలో ఇంటర్మీడియట్ శ్రీ చైతన్య బాలుర కళాశాల (గోశాల)లో చదివాడు. తండ్రి డా. వడ్డేపల్లి శ్రీనివాసరావు సంస్కృతాంధ్ర పండితుడు, స్థానిక శ్రీలక్ష్మ కలాశాలలో సంస్కృతాంధ్ర అధ్యాపకునిగా పనిచేస్తున్నారు. తాత్వికులు గెంటేల వెంకటరమణ దంపతులు యజ్ఞేశ్వర్‌ను ఆదివారం శ్రీ గురుధాంలో అభినందించారు. తల్లిదండ్రుల అధ్యాపకుల ప్రోత్సాహంతో రమణ గురువుల ఆశీస్సులతో తాను ఈ ర్యాంక్ సాధించానని, భవిష్యత్‌లో న్యూరో సర్జన్‌గా ప్రజలకు సేవలందిస్తానని యజ్ఞేశ్వర్ తెలిపారు. ఈ సంవత్సరం మే 4న నిర్వహించిన నీట్ పరీక్షలో సుమారు 21 లక్షల మంది హాజరు కాగా తమ కుమారుడు ఈ ర్యాంక్ సాధించడం పట్ల తల్లిదండ్రులు భువనేశ్వరి, శ్రీనివాసరావు దంపతులు హర్షం వెలిబుచ్చగా పలువురు అభినందించారు.

సిఎం సహాయ నిధి చెక్కు అందజేత

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : మండలంలోని పోచంపల్లి గ్రామానికి చెందిన అంగిరేకుల వెంకటరామయ్య ఇటీవల అనారో గ్యంతో బాధపడుతూ ప్రైవేట్ హాస్పిటల్ లో చికిత్స చేయించు కున్నారు. ఆ మెడికల్ బిల్లులను ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య సిఫార్సు ద్వారా సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేయగా మంజూరైన రూ.25 వేల చెక్కును ఎంఎల్ఎ నివాసంలో బాధితులకు అందజేశారు.

సిసి కెమెరాల ఆధారంగా నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : సిసి కెమెరాల ఆధారంగా పోలీసులు ఆదివారం నిందితుడిని గంటల వ్యవధిలోనే అదుపులోకి తీసుకున్నారు. జగ్గయ్యపేట పట్టణ పోలీస్‌స్టేషన్‌కు క్రిస్టియన్ పేటకు చెందిన అభిమల్ల మణి అనే మహిళ జగ్గయ్యపేట పోలీస్ స్టేషన్‌కు వచ్చి తన కుమారుడు వెంకయ్య ఆదివారం తెల్లవారుజామున జగ్గయ్యపేట కురగాయల మార్కెట్ దగ్గర ఉన్న అంబేద్కర్ విగ్రహం దగ్గర చనిపోయి ఉన్నాడని తెలిపింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు జగ్గయ్యపేట సిఐ పి వెంకటేశ్వరరావు గంటల వ్యవధిలోనే సిసి కెమెరాల ఆధారంగా నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ఆదివారం ఈ మేరకు సిఐ విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. జగ్గయ్యపేట విలియంపేటకు మృతుడు అభిమల్ల వెంకయ్య (32) కాగితాలు ఏరుకుని జీవనం సాగిస్తున్నాడు. మద్యం తాగే అలవాటు ఉంది. ప్రతిరోజు పని చేయగా వచ్చిన డబ్బులతో మద్యం తాగేవాడు. ఈ క్రమంలో విలియంపేటకు చెందిన చెప్పులు కుట్టుకునే అల్లూరి కృష్ణతో పరిచయం ఏర్పడి స్నేహంగా ఉండేవారు. ఈ నేపథ్యంలో ఈ నెల 21వ తేదీ రాత్రి సమయంలో బ్రాందీ షాప్ వద్ద ఇద్దరు మద్యం తాగి గొడవ పడ్డారు. ఆ సమయంలో అల్లూరి కృష్ణ వెంకయ్యను ఎలాగైనా చంపుతానని బెదిరించగా అక్కడ ఉన్నవారు ఇద్దరినీ అడ్డుకున్నారు. అనంతరం ఆదివారం తెల్లవారుజామున 5 గంటల ప్రాంతంలో అంబేద్కర్ విగ్రహం వెనక ఒంటరిగా ఉన్న వెంకయ్యను కృష్ణ రాయితో కొట్టి చంపి పారిపోయారు. జగ్గయ్యపేట పోలీసులు సిసి కెమెరాల ఆధారంగా కేవలం గంటల వ్యవధిలో నిందితుడును గుర్తించడం, సాంకేతిక ఆధారాల ద్వారా అదుపులోకి తీసుకొని విచారించి అరెస్టు చేశారు. గంటల వ్యవధిలో నిందితున్ని అరెస్టు చేయటం కీలక వ్యవహరించిన అధికారులు మరియు సిబ్బందిని ఉన్నత అధికారులు అభినందించారు.

వివరాలు తెలుపుతున్న సిఐ వెంకటేశ్వరరావు

కొటికలపూడిలో గ్రామీణ శ్రామికుల సర్వే

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : కోటికలపూడి గ్రామంలో గ్రామీణ శ్రామికుల సర్వే సందర్భంగా సిఐటియు రాష్ట్ర నాయకులు డి.వి.కృష్ణ, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌సిహెచ్.శ్రీనివాస్, సిఐటియు ఇబ్రహీంపట్నం మండల కార్యదర్శి ఎం.మహేష్ కొటికలపూడి గ్రామంలో సర్వేలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భవిష్యత్తులో కొటికలపూడి గ్రామంలో కృష్ణ వాటర్ సరఫరా చేయాలని, అంబేద్కర్ బొమ్మ వద్ద ఉన్న ట్రాన్స్ఫర్‌ను మరో పక్కకి తరలించాలని, రాత్రింబవళ్లు తేడా లేకుండా విపరీతంగా ఇసుక ట్రాక్టర్లను అరికట్టాలని నిర్ణయించారు. గ్రామంలో రోడ్ల సమస్య పరిష్కరించాలని, ఇటీవల విద్యుత్ సర్క్యూట్ మొక్కజొన్న రైతు సమస్యలపై పని చేయాలని నిర్ణయం చేశారు. సర్వేకి సహకరించిన అంగన్వాడీ టీచర్ రజినీ, అంగన్వాడీ హెల్పర్ అశ్విని, ఆశా వర్కర్స్ యూనియన్ అంజలి, రాణి, భూ లక్ష్మీ, మధ్యాహ్న భోజన ఏజెన్సీ వర్కర్స్ లక్ష్మి, కళ్యాణీ, ఎస్ఎఫ్ఐ కోటికి సిఐటియు యూనియన్ పక్షాన ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎ.విఠల్ రావు, ఇ.కొండలరావు, ఎస్.పాపయ్య కొటికలపూడి బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ సెక్రటరీ సుఖబోగి కోటి, ఉపాధ్యక్షులు శంకర్రావు, కనకరాజు, క్రషర్ లారీ డ్రైవర్ యూనియన్ సెక్రటరీ పి రోశయ్య,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

సర్వే నిర్వహిస్తున్న డివి.కృష్ణ, ఎన్‌సిహెచ్, తదితరులు

కష్టపడితేనే పదవులు : టిడిపి

ప్రజాశక్తి - గంపలగూడెం: టిడిపిలో ఇష్టపడిన నాయకులు వెంట తిరిగితేనో, అడిగితేనో పదవులు రావని, గంపలగూడెం మండలం టిడిపి సీనియర్ నాయకులు చెరుకూరి రాజేశ్వరరావు పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం తోటమూలలో ఉన్న ఒక కళ్యాణ మండపంలో మండల పార్టీ విస్తత సమావేశం ఆ పార్టీ అధ్యక్షుడు రేగళ్ల వీరారెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాజేశ్వరరావు మాట్లాడుతూ, పది సంవత్సరాలుగా పార్టీ జెండా మోసి, సమస్యాత్మక పరిస్థితులు తలెత్తకుండా పార్టీకి సేవ చేసినందునే నేడు రేగళ్ల వీరారెడ్డి సతీమణి లక్ష్మీ అనితకు ఏఎంసీ చైర్మన్ పదవి వరించిందని చెప్పారు. దీన్నిబట్టి రాష్ట్రవ్యాప్తంగా, పార్టీకి పనిచేస్తేనే పదవులు వస్తాయని రాజేశ్వరరావు ఉద్ఘాటించారు. గత ప్రభుత్వంలో అనేక సమస్యలను ఎదుర్కొని, మళ్లీ టిడిపి అధికారంలోకి వచ్చిందని, అయినప్పటికీ గ్రామాల్లో చిన్న చిన్న సమస్యలు ఉన్నాయన్నారు. వాటిని దష్టిలో పెట్టుకొని పార్టీకి ద్రోహం చేసేందుకు ఎవరు ప్రయత్నించకూడదని పార్టీ క్యాడర్ ను కోరారు. ఈ నెల 26న తిరువూరు ఏఎంసి ప్రాంగణంలో లక్ష్మీ అనిత ప్రమాణ స్వీకార మహోత్సవం జరుగుతుందని తెలిపారు. సీనియర్ నాయకులు వై.పుల్లయ్య చౌదరి మాట్లాడుతూ పెద్ద కొమెర టిడిపి మాజీ సర్పంచ్ ఇనుగంటి రాంబాబు ప్రథమ వర్ధంతిని పురస్కరించుకుని ఈ నెల 28న విగ్రహావిష్కరణ జరుగుతుందని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కార్యకర్తలను కోరారు. మాజీ ఎంపిపి కోటగిరి శ్రీనివాసరావు, రాష్ట్ర ఎస్సీ సెల్ నాయకుడు బూరుగు నారాయణ, మాజీ జెడ్పిటిసి సభ్యుడు డివి కృష్ణారావు, స్థానిక ఎంపిటీసీ సభ్యుడు దొంతాల బుచ్చి రామయ్య, వివిధ గ్రామాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న టిడిపి సీనియర్ నాయకులు రాజేశ్వరరావు

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా

ప్రజాశక్తి - వత్సవాయి : పగలు రాత్రులు తేడా లేకుండా 24 గంటలు ఇసుక రవాణా చేస్తున్నారు. ప్రభుత్వ అనుమతులకు వ్యతిరేకంగా ఈ ఇసుక రవాణా జరుగుతుంది. మ్యాన్ పవర్ ఉపయోగించకుండా 200 పొక్లెయిన్‌తో యథేచ్ఛగా రవాణా జరుగుతుంది. సంబంధిత మునేరు, రెవెన్యూ, ఎంపీడీవో, పోలీస్ అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. దీనిలో ఉన్న ఆంతర్యం ఏమిటనీ ఈ ట్రాక్టర్లు ఇసుకతోలేవారు కనీసం ట్రాక్టర్ పైన ఎలాంటి పట్టా కూడా కట్టకుండా అతివేగంగా నడుపుతున్నారని, ఇంత బహిరంగంగా నడుపుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని విమర్శిస్తున్నారు. సామాన్యుడు ఇంత ఇసుక తీసేకపోతే చాలా నిబంధనలుంటాయని, ఇలాంటి అక్రమ రవాణాలకు మాత్రం పట్టింపులు లేవేమో నని పలువురు గుసగుసలాడుతున్నారు. ఏదేమైనా అధికారులు స్పందించి అక్రమ రవాణా అడ్డుకోవాలని కోరుతున్నారు.

లా సెట్‌లో 22వ ర్యాంకర్ భవ్యశ్రీకి సత్కారం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారి సంకా శ్రీనివాసరావు కుమార్తె భవ్య శ్రీ ఇటీవల తిరుపతి పద్మావతి విశ్వవిద్యాలయం నిర్వహించిన లాసెట్లో 22వ ర్యాంకు సాధించింది. ఆదివారం స్థానిక ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య భవ్య శ్రీ నివాసానికి వచ్చి లా సెట్ లో గతంలో ఎన్నడూ లేని విధంగా జగ్గయ్యపేట నుంచి 22వ ర్యాంకు సాధించినందుకు ప్రత్యేకంగా అభినందించారు. ఆమె భవిష్యత్తులో కార్పొరేట్ అడ్వకేట్ కావాలని ఆకాంక్షను వ్యక్తం చేయగా ఆయన తప్పనిసరిగా లక్ష్యాన్ని సాధించాలని ఆశీస్సులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంకా వెంకటేశ్వరరావు, వెంకట్రావు, భాస్కర్ రావు, శ్రీనివాసరావు కుటుంబ సభ్యులతో పాటు అప్సర రెసిడెన్సిలోనే పలువురు నివాసులు పాల్గొన్నారు.

మున్సిపల్ చైర్మన్ చిట్టిబాబుకు సత్కారం

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : కొండపల్లి మున్సిపల్ నూతన చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబును కొండపల్లి ఆర్యవైశ్య సంఘం నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. చిట్టిబాబును శాలువా, పుష్పగుచ్ఛంతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొండపల్లి ఆర్యవైశ్య సంఘం నాయకులు గుడిపాటి హరికష్ణ, రమణ, బ్రహ్మాజీ, డుంబు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చైర్మన్, వైస్ చైర్మన్లకు సత్కారం

కొండపల్లి మున్సిపల్ చైర్మన్ చిట్టి బాబు, వైస్ చైర్మన్ చుట్టుకుదురు శ్రీనివాసరావును కొండపల్లి మున్సిపాలిటీ ఎస్సీ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శాలువా, పుష్పగుచ్ఛంతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కొండపల్లి మున్సిపాలిటీ ఎస్సీ నాయకులు కూచిపూడి దిలీప్ కుమార్, పాల్గొన్నారు.

పిఆర్‌సి కమిషన్‌ను వెంటనే నియమించాలి

-ఏపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిరంజీవి

ప్రజాశక్తి - కలెక్టరేట్ (కృష్ణా) : పిఆర్‌సి కమిషన్ వెంటనే నియమించాలని, పెండింగ్ డిఎలు, పాత బకాయిలను చెల్లించాలని ఎపిటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.చిరంజీవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కాలేజ్‌లో కె.శేషగిరి అధ్యక్షతన ఎపి టిఎఫ్ జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య వక్తగా విచ్చేసిన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.చిరంజీవి మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు వెంటనే పిఆర్‌సి కమిషన్‌ను వెంటనే నియమించాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి బి.లంకేష్ మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభం అయిన వెంటనే ట్రైనింగ్స్ పెట్టి టీచర్స్‌ను బోధనకు దూరం చేయడం తగదని ఆగస్టు తరువాత ట్రైనింగ్స్ ఇవ్వాలని కోరారు. రాష్ట్ర మాజీ అధ్యక్షులు జి.సత్యనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలన్నారు. విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలకు ఆకర్షితమయ్యేలా విద్యా విధానాలు రూపొందించాలని, ఆన్లైన్ పనులతో బోధనా సమయాన్ని హరించకుండా చూడాలన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు టి.దస్తగిరి మాట్లాడుతూ ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన సరెండర్ లీవ్ బిల్స్ మంజూరు చేయాలన్నారు. రాష్ట్ర కార్యదర్శి తమ్ము నాగరాజు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వులకు అనుగుణంగా డిఎస్‌సి-2003 ఉపాధ్యాయులకు పాత పెన్షన్ ఇవ్వాలని కోరారు. గౌరవ అధ్యక్షులు ఎన్.రామబ్రహ్మం మాట్లాడుతూ సంఘ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు వి.శివరామ కృష్ణ కెవి.ఎన్ ఆర్ఆర్ ప్రసాద్, కార్యదర్శులు తాతా రేణుకారావు, కోటప్రోలు శ్రీనివాసరావు, స్టేట్ కౌన్సిలర్లు జి.ఎస్.శుభాకరరావు, పి.రామ చంద్రరావు,స్వామి, గుప్తా,పలు మండలాల నుండి విచ్చేసిన బాధ్యులు. రామలక్ష్మి, వి కోటేశ్వరమ్మ, పి.రవి బాబు, జి.హరి, జె.రూబెన్, ఎస్. రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక : కలెక్టర్

ప్రజాశక్తి - కలక్టరేట్ (కృష్ణా) : నేడు కలెక్టరేట్ సమావేశ హాలులో ఉదయం 10:30 గంటల నుండి ప్రజా సమస్యల పరిష్కార వేదిక - మీకోసం (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం నిర్వహించి ప్రజల నుండి అర్జీలు స్వీకరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలకు పాలనను మరింత చేరువ చేయడానికి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను మండల, మున్సిపల్ స్థాయిలకు ప్రభుత్వం వికేంద్రీకరించినట్లు కలెక్టర్ తెలిపారు. ఇందులో భాగంగానే జిల్లా కేంద్రంతో పాటు అన్ని డివిజన్, మండల కేంద్రాల్లో, మునిసిపల్ కార్యాలయాల్లో కూడా ప్రజా సమస్యల పరిష్కార వేదిక- మీకోసం కార్యక్రమం జరుగుతుందని జిల్లా కలెక్టర్ వివరించారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని మండల కార్యాలయాలు లేదా మున్సిపల్ కార్యాలయాలలో అందజేయవచ్చన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక మీకోసం కాల్ సెంటర్ నంబర్ 1100కు ప్రజలు ఎవరైనా సరే కాల్ చేసి అర్జీ నమోదు చేసుకోవడంతో పాటు వారి అర్జీ స్థితిని తెలుసుకోవచ్చన్నారు. అర్జీదారులు meekosam.ap.gov.in వెబ్‌సైట్‌లో వారి అర్జీలు నమోదు చేసుకోవచ్చన్నారు. కావున ప్రజలు ఈ విషయాన్ని గమనించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవలసినదిగా జిల్లా కలెక్టర్ కోరారు.

సంబరాల్లో పాల్గొన్న ఎంఎల్ఎ కాగిత కృష్ణ ప్రసాద్

నూతలపాడు గ్రామంలో విషాదం

ప్రజాశక్తి - నందివాడ : ఇరువురు మధ్య జరిగిన వివాదం ఓ నిండు ప్రాణాన్ని బలితీసుకుంది. ఈ విషాదకర సంఘటన నందివాడ మండలం జనార్ధనపురం శివారు నూతులపాడు గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం దారం శ్రీనివాసరావు గేదెల షెడ్డు నుంచి వచ్చే మురుగు నీరు దారం భాస్కరరావు సరిహద్దు వైపు రావడంతో పేడ వాసన వస్తుందంటూ శనివారం వాగ్వాదానికి దిగారు. ఆ సమయంలో ఇంటిలో ఉన్న భాస్కరరావు పెద్ద కుమారుడు కోటేశ్వరరావు(45) ఇంటి బయటకు వచ్చి దారం శ్రీనుతో మాట్లాడేందుకు ప్రయత్నించగా గడ్డపలుగుతో దారం కోటేశ్వరరావును కుడి వైపున తల మీద కొట్టగా తలకు బలమైన గాయమైంది. కోటేశ్వరరావును వైద్యం నిమిత్తం గుడివాడలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం విజయవాడ తీసుకెళ్లాలని వైద్యులు తెలిపారు. విజయవాడ నుండి సాయంత్రం గుడివాడ హాస్పిటల్‌కి తీసుకురాగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. దారం కోటేశ్వరరావు(45)కు భార్య కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుని భార్య సంగీత ఫిర్యాదు మేరకు నందివాడ పోలీసులు స్టేషన్లో ఫిర్యాదు చేయగా పోలీసులను నిందితుని అదుపులోకి తీసుకొని కోర్టులో హాజరు పరిచారు. 15 రోజులు రిమాండ్ విధించారు.

మృతిచెందిన దారం కోటేశ్వరరావు

శ్రీ రేణుకమ్మ గుడిలో సంబరాలు

ప్రజాశక్తి - గూడూరు : గూడూరు మండలం తరకటూరుపాలెం గ్రామంలో శ్రీ రేణుకమ్మతల్లి అమ్మవారి సంబరాలలో పెడన ఎంఎల్ఏ కాగిత కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అర్చకులు కృష్ణప్రసాద్‌కు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పోతన స్వామి, గోపి నాగబాబు, కాట్రగడ్డ సత్యనారాయణ, ఎన్ఎ బేగ్, కాట్రగడ్డ రత్నబాబు, గ్రామస్తులు, యాత్రికులు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య పేద మహిళలకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి - గుడివాడ : గుడివాడ నియోజకవర్గంలో ఎన్ని దశాబ్దాలు గడిచిన టిడిపి జెండాను తప్ప మరో జెండాను ఎగరనివ్వనని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. ఎమ్మెల్యేగా ఏడాది తన ప్రయాణంలో ఆటుపోట్లు ఎదురైనా నిజాయితీగా కొనసాగించానని ప్రజలు తనపై చూపిస్తున్న ప్రేమే తన నిజాయితీకి నిదర్శనమన్నారు. శనివారం రాత్రి స్థానిక ప్రజా వేదికలోని టిడిపి కార్యాలయంలో ఆర్యవైశ్య కార్పొరేషన్ రాష్ట్ర వైస్ చైర్మన్ గోకవరపు సునీల్ ఆధ్వర్యంలో పేద ఆర్యవైశ్య పేద మహిళకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెనిగండ్ల ఏర్పాటు చేసిన కేక్‌ను పార్టీ శ్రేణులతో కలసి కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యేగా ఏడాది నా ప్రయాణంలో ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొన్నానని, కొందరు పనిగట్టుకుని చేసే సొల్లు వాగుళ్ళను తాను పట్టించుకోనని, నిజాయితీగానే ముందుకు సాగుతున్నానని పేర్కొన్నారు. గుడివాడ నియోజకవర్గంలో ఎన్నికలు వచ్చినా గెలుపు టిడిపికి మాత్రమే సొంతం అయ్యేలా ఈ నాలుగేళ్ల కష్టపడి పని చేస్తానన్నారు. గుడివాడలో టిడిపి జెండా తప్ప మరో జెండా ఎగరనిచ్చే ప్రసక్తి ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ స్టేడియం కమిటీ వైస్ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, టిడిపి నాయకులు పిన్నమనేని బాబ్జి, చేకూరు జగన్మోహన్రావు, మార్కెట్ యార్డ్ చైర్మన్లు పొట్లూరు రవి, చాట్రగడ్డ రవికుమార్, గుడివాడ టిడిపి అధ్యక్షుడు దింట్యాల రాంబాబు, రూరల్ మండల అధ్యక్షుడు వాసే మురళి, నందివాడ మండల అధ్యక్షుడు దానేటి సన్యాసిరావు, తదితరులు పాల్గొన్నారు.

కొండలమ్మను దర్శించుకున్న యాత్రికులు

ప్రజాశక్తి - గుడ్లవల్లేరు : జిల్లాలో ప్రసిద్ధిగాంచిన వేమవరం శ్రీ కొండలమ్మను ఆదివారం అధిక సంఖ్యలో యాత్రికులు దర్శించుకున్నారు. సుమారు 20 వేల మంది యాత్రికులు అమ్మవారిని దర్శించుకొని పాల పొంగళ్ళు సమర్పించి వారి వారి మొక్కుబడులను తీర్చుకున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ఆకుల కొండలరావు తెలిపారు. దర్శనానికి విచ్చేసిన యాత్రికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

24న హుండీల లెక్కింపు : యాత్రికులు అమ్మవారికి సమర్పించిన కానుకల హుండీల లెక్కింపు కార్యక్రమాన్ని ఈనెల 24వ తేదీ నిర్వహిస్తున్నట్లు ఈవో కొండలరావు తెలిపారు.

విజేత టీమ్‌కు బహుమతి అందజేస్తున్న దృశ్యం

క్రికెట్ టోర్నీ విజేత మెరకనపల్లి హోమ్ టీం

ప్రజాశక్తి - మోపిదేవి : వేసవికాలం గ్రామీణ ప్రాంతాల్లో క్రికెట్ టోర్నమెంట్లు అత్యంత ఉషారుగా జరుగుతున్నాయి. గత నెలరోజులపైగా మెరకనపల్లి గ్రామంలో జరుగుతున్న క్రికెట్ టోర్నమెంట్లో ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్లో మెరకనపల్లి హోం టీం ఘనవిజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో మొదట టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న చల్లపల్లి సద్దాం టీం నిర్ణీత 12 ఓవర్లలో 58 పరుగులు చేసింది. ఛేదనలో మెరకనపల్లి హోమ్ టీమ్ 6 ఓవర్లులోనే సదరు లక్ష్యాన్ని ఛేదించి 10 వికెట్లు తేడాతో ఘనవిజయం సాధించింది. అనంతరం ఈ టోర్నమెంట్‌కి సంబంధించి మొదటి బహుమతిని మెరకనపల్లి హోమ్ టీంకి యర్రంశెట్టి సందీప్ 15,000 అందించగా, రెండో బహుమతిని చల్లపల్లి సద్దాం టీంకి మెరనపల్లి నవీన్ అన్నయ్య కృష్ణ జ్ఞాపకార్థం పదివేలు అందించారు. మూడో బహుమతి మెరకనపల్లి జూనియర్స్ టీంకి యడ్లపల్లి కార్తీక్ అందించారు. ఈ కార్యక్రమంలో పలు గ్రామాల, పట్టణాల క్రీడాకారులు, మెర కనపల్లి యువత, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉద్యోగుల బదిలీల పట్ల హర్షం

ప్రజాశక్తి - కలక్టరేట్ (కృష్ణా) : వైద్య ఆరోగ్య శాఖలో ఇటీవల జరిగిన ఉద్యోగుల బదిలీల పట్ల ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా కమిటీ సంతృప్తి వ్యక్తం చేసింది. ఎటువంటి అవినీతికి గాని ఎటువంటి అన్యాయానికి గాని ఆస్కారం ఇవ్వకుండా బదిలీలు ఇంత పెద్ద ఎత్తున సజావుగా జరగడం వైద్య ఆరోగ్య శాఖలో చాలా అరుదైన అంశంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేఆర్ సూర్య నారాయణ, కార్యదర్శి ఎం.రమేష్ కుమార్ పేర్కొన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం అంతా రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రివర్యులు సత్య కుమార్ యాదవ్ కృషి పర్యవేక్షణేనన్నారు. ఉద్యోగుల బదిలీ ప్రక్రియను ఎప్పటికప్పుడు అటు ఉన్నత అధికారులకు ఇటు ఉద్యోగస్తులకు ఉద్యోగ సంఘాలను సమన్వయం చేసుకుంటూ సమయానికి అనుగుణంగా బదిలీల గురించి తగు సూచనలు జారీ చేస్తూ బదిలీల ప్రక్రియ అత్యంత పారదర్శకంగా జరిగే విధంగా మంత్రి కృషి మరువలేనిదన్నారు. అలాగే బదిలీల ప్రక్రియను పారదర్శకంగా కొనసాగించడానికి కృషిచేసిన వైద్యారోగ్య శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ కృష్ణ బాబు డైరెక్టర్లు , ఉన్నతాధికారులకు అలాగే అన్ని జిల్లాలతో పాటు కృష్ణా జిల్లాలో కూడా అత్యంత పారదర్శకంగా ఇటువంటి అవినీతి లేకుండా కృషి చేసిన జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఎస్.శర్మిష్ఠ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కృష్ణా జిల్లా శాఖ తరపున కృతజ్ఞతలు తెలిపారు. శక్తి వంచన లేకుండా తమ విధి నిర్వర్తిస్తామని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కృష్ణా జిల్లా శాఖ తరపున జిల్లా అధ్యక్షులు రాము కార్యదర్శి తోట వరప్రసాద్, కార్యవర్గ సభ్యులు తెలిపారు.

24న వాహనాలు వేలం

ప్రజాశక్తి - తిరువూరు : స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో వివిధ కేసులలో పట్టుబడిన 19 వాహనాలకు ఈనెల 24వ తేదీ ఉదయం 10.30 గంటలకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు సీఐ తెలిపారు. తమ శాఖ సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో నిబంధనల మేరకు జరిగే ఈ వేలంలో పాల్గొనే వారు జీఎస్టీ నెంబర్ తప్పనిసరిగా కలిగి ఉండాలన్నారు. దరఖాస్తుతో పాటు రూ.1000 చెల్లించాలని చెప్పారు.

నివాళులర్పిస్తున్న ప్రముఖ నిర్మాతలు ఆదిత్య రామ్, సి.కళ్యాణ్ తదితరులు; అంతర్‌చిత్రంలో ముత్యాల రమేష్ (పాతచిత్రం)

తెలుగు ఫిలిం ఛాంబర్ మాజీ కార్యదర్శి రమేష్ మృతి

పలువురు సినీ ప్రముఖులు నివాళి

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : తెలుగు ఫిలిం ఛాంబర్ మాజీ కార్యదర్శి, ప్రముఖ డిస్ట్రిబ్యూటర్, శక్తి పిక్చర్స్ అధినేత ముత్యాల రమేష్ మృతిచెందారు. ఆయన పార్థివ దేహాన్ని ఆదివారం విజయవాడ గాంధీనగర్లోని ఫిలిం చాంబరుకు తీసుకువచ్చారు. పలువురు సినీ ప్రముఖులు సందర్శించి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిర్మాతలు ఆదిత్య రామ్, సి కళ్యాణ్ మాట్లాడుతూ ముత్యాల రమేష్ తెలుగు ఫిలిం చాంబర్‌కు ఎనలేని సేవలు అందించారని కొనియాడారు. సీనియర్ ఫిలిం డిస్ట్రిబ్యూటర్ డిస్ట్రిబ్యూటర్లకు తన సహాయ సహకారాలు అందిస్తూ తలలో నాలికలా ఉండేవారన్నారు. డిస్ట్రిబ్యూటర్ రంగం నుండి 2006, 2017 సంవత్సరాలలో తెలుగు ఫిలిం ఛాంబర్‌కు కార్యదర్శిగా వ్యవహరించారని గుర్తుచేశారు. ఈకార్యక్రమంలో ప్రస్తుత ఫిలిం చాంబర్ కార్యదర్శి కాకుమాను ప్రసాద్, సహ కార్యదర్శి మోడల్ ఫిలింస్ శివ, కుమార్, రామా టాకీస్ సాయి, ఎన్ విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డు రెవెన్యూ ఉద్యోగులకు సన్మానం

ప్రజాశక్తి- నందిగామ : రెవెన్యూ దినోత్సవం సందర్బంగా రెవెన్యూ రిటైర్డ్ ఉద్యోగులను నందిగామ ఆర్‌డిఓ బాలకష్ణ సన్మానించారు. ఉప తహసీల్దార్‌గా ప్రజల మన్ననలు పొంది ఉద్యోగ విరమణ చేసిన దాదాసాహెబ్‌ను ఆర్‌డిఓ సన్మానించారు. రెవెన్యూ రిటైర్డ్ ఉద్యోగులు అప్పారావు, కటారపు పుల్లయ్య, చిన వెంకటేశ్వర్లు తదితరులు సన్మానం అందుకున్నారు. నందిగామ తహశీల్దారు సురేష్, రెవెన్యూ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

నందిగామలో రెవెన్యూ రిటైర్డ్ ఉద్యోగులను సన్మానిస్తున్న ఆర్‌డిఓ బాలకృష్ణ తదితరులు

డాక్టర్ ఎన్ సుబ్బారావు కార్డియాక్ హాస్పిటల్ ప్రారంభం

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ : విజయవాడ సూర్యారావుపేట ప్రకాశం రోడ్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన డాక్టర్ ఎన్ సుబ్బారావు సెంటర్ ఫర్ కార్డియాక్ కేర్ హాస్పిటల్‌ను విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), ఎమ్మెల్యేలు కామినేని శ్రీనివాస్, గద్దె రామ్మోహన్, ప్రముఖ వైద్యులు డాక్టర్ సోమరాజు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్డియాలజీ సూపర్ స్పెషాలిటీ, ఆంధ్ర యూరాలజీ అండ్ గైనకాలజీ సెంటర్‌ను లాంఛనంగా ప్రారంభించారు. ఈసందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ చిన్ని మాట్లాడుతూ డాక్టర్ ఎన్. సుబ్బారావు గొప్ప పేరున్న వైద్యులని, ఆయన పేరుమీద హాస్పిటల్ ఏర్పాటు చేసి ప్రారంభించుకోవడం ఆనందంగా ఉందని అన్నారు. విజయవాడకు మరిన్ని హాస్పిటల్ రావాలని, ముఖ్యమంత్రి లక్ష్యాల మేరకు విజయవాడను మెడికల్ హబ్‌గా మార్చుకోవాలని అభిప్రాయపడ్డారు. అన్ని రంగాలలో టెక్నాలజీ పెరిగిందని, ముఖ్యంగా వైద్య వత్తిలో మోడల్ టెక్నాలజీ పెరిగిందని అన్నారు. డాక్టర్ మురళీకష్ణ కుటుంబ సభ్యులు విజయవాడ మీద ప్రేమతో ఇక్కడే హాస్పిటల్ ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే కామినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ డాక్టర్ మురళీకష్ణ ఆయన తండ్రి పేరిట హాస్పిటల్‌ను ప్రారంభించడం అభినందనీయమన్నారు. ఈ హాస్పిటల్ ద్వారా మంచి సేవలు అందించాలని సూచించారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ విజయవాడలో డాక్టర్ ఎన్. సుబ్బారావు హాస్పిటల్ అంటే ఒక ల్యాండ్ మార్క్ అని చెప్పుకొచ్చారు. అలాంటి హాస్పిటల్‌కు పూర్వ వైభవం తీసుకువచ్చేలా వారి మూడో జనరేషన్ హాస్పిటల్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. డాక్టర్ మురళీకష్ణ మాట్లాడుతూ నేడు అతిథుల సమక్షంలో హాస్పిటల్ ప్రారంభించుకోవడం ఆనందంగా ఉందన్నారు. తమ పిల్లలు వరుణ్, పవన్, మనోజ్ వర్షిణి ప్రజలకు ఉపయోగపడాలని ఒపిడి సేవలు ప్రవేశపెట్టామని అన్నారు. పేద, మధ్య తరగతి ప్రజలకు కార్పొరేట్ వైద్యం అందించాలన్న ఉద్దేశంతో వైద్యసేవలు ప్రారంభించామన్నారు. అనంతరం డాక్టర్ సోమరాజు మాట్లాడుతూ డాక్టర్ మురళీకష్ణ కుటుంబసభ్యులు వైద్య వత్తిలో ఉండటం గర్వకారణమని అన్నారు. అనంతరం యూరాలజిస్ట్, రోబోటిక్ సర్జన్ డాక్టర్ మనోజ్ తుమ్మల మాట్లాడుతూ తాను టాటా మెమోరియల్ కాన్సర్ ఇనిస్ట్యూట్ లో రెండు సంవత్సరాల పాటు యూరో ఆంకాలని, రెబోటిక్ ఫెలో షిప్ చేశానని చెప్పారు. పుట్టిన ఊరుకు వైద్యం సేవలు చేయాలన్న ఉద్దేశంతో ఆసుపత్రిని ప్రారంభించామని అన్నారు. కోతలేకుండా సర్జరీ చేయడం ప్రత్యకత అని చెప్పారు. తమ ఆసుపత్రిలో గుండె జబ్బులతో పాటు కిడ్నీ సంబంధిత వ్యాధులు, గర్భకోశ వ్యాధులతో పాటు, యూరాలజీ వైద్య సేవలు అందిస్తారని అన్నారు. ఆధునిక లేపరోస్కోపిక్ గైనకాలజీ సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలియజేశారు.

జ్యోతి వెలిగించి ఆస్పత్రిని ప్రారంభిస్తున్న ఎంపి కేశినేని శివనాథ్, ఎంఎల్‌ఎలు గద్దె రామమోహనరావు, కామినేని శ్రీనివాస్, ప్రముఖ వైద్యులు డాక్టర్ సోమరాజు; చిత్రంలో డాక్టర్ మురళీకృష్ణ తదితరులు

ఆయుష్ హాస్పిటల్ ఆధ్వర్యంలో యోగా వేడుకలు

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ : నగరంలోని ఆయుష్ హాస్పిటల్ ఆధ్వర్యంలో 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు జరిగాయి. హాస్పిటల్ చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఎం.జయ లక్ష్మీ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో వైద్యులు, వైద్య సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జయలక్ష్మీ మాట్లాడుతూ యోగా ఒక భూమి....ఒక ఆరోగ్యం అనే థీమ్‌తో ఈ ఏడాది కార్యక్రమాన్ని నిర్వహించారన్నారు. ఆరోగ్యానికి యోగానే ఆధారమని, ప్రతి వ్యక్తి ఆరోగ్యం, పర్యావరణ సంక్షేమం యోగా జీవన విధానంతోనే సాధ్యమని వైద్యులు సూచించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో తమ సిబ్బందితోపాటు చుట్టుపక్కల కాలనీ వాసులు కూడా పాల్గొన్నారని అన్నారు. ఈ సందర్భంగా 600 మందికి పండ్లు, మొలకలు, ప్రోటీన్‌తో కూడిన ఆహారాన్ని అందించారు.

ఆయుష్ ఆస్పత్రి ఆధ్వర్యాన యోగాసనాలు వేస్తున్న వైద్యులు, వైద్య సిబ్బంది

రక్త దానానికి అందరూ ముందుకు రావాలి

బ్లడ్ బ్యాంక్ ప్రారంభోత్సవంలో కలెక్టర్ లక్ష్మీశ

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్

ఒక్క యూనిట్ రక్తం ముగ్గురి ప్రాణాలను కాపాడేటమే కాకుండా కేవలం గంట సమయంలో చేసే రక్త దానం జీవితకాల ప్రభావం చూపుతుందిని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీ శా చెప్పారు. రక్తదానం అనేది ఒక స్వచ్ఛంద చర్యని, ఇది అనేక మంది రోగులకు నూతన జీవనాన్ని అందిస్తుందని అన్నారు. గాయాలు, శస్త్రచికిత్సలు, సికిల్ సెల్ అనీమియా, తలసేమియా, కాన్సర్ వంటి వ్యాధులతో బాధపడే వారికి రక్తం అత్యవసరం అవుతుందని పేర్కొన్నారు. రక్తదానం చేసేందుకు ప్రతి ఒక్కరు ముందుకు రావాలని ఆయన కోరారు. నగరంలోని వికెఆర్ రోటరీ క్లబ్ , అమరావతి రోటరీ బ్లడ్ బ్యాంకు ను ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ ఆదివారం ఉదయం లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు రక్తం యొక్క ప్రాముఖ్యతను, బ్లడ్ బ్యాంక్ యొక్క ప్రాముఖ్యతను సమాజానికి తెలియజేసేందుకు అనేక సూచనలు సలహాలను అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశతోపాటు ఆల్ ఇండియా డ్రగ్ కంట్రోల్ ఆఫీసర్ ఫెడరేషన్ డైరెక్టర్ జనరల్ రావి ఉదయభాస్కర్, రోటరీ క్లబ్ ఆఫ్ అమరావతి అధ్యక్షులు ప్రఫుల్, రోటరీ గవర్నర్ డాక్టర్ ఎం వెంకటేశ్వ్రరావు మాట్లాడుతూ సురక్షిత రక్త సరఫరా కోసం స్వచ్ఛంద, రెమ్యునరేషన్ లేని రక్తదానం అత్యంత కీలకమైనదని అన్నారు. విజయవాడ రెడ్ క్రాస్ సొసైటీ, రోటరీ క్లబ్‌లు వంటి సంస్థలు రక్తదాన శిబిరాలను నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ అమరావతి సహాయ గవర్నర్ డాక్టర్ హర్ష, కార్యదర్శి వినయ్ తదితరులు పాల్గొన్నారు

బ్లడ్ బ్యాంక్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ

నేడు, రేపు ఫిక్కీ బి 2బి సమావేశాలు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : షార్జా ఎయిర్‌పోర్ట్ ఇంటర్నేషనల్ ఫ్రీ జోన్ (సైఫ్ జోన్) సహకారంతో ఇండియన్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఫిక్కీ) సంయుక్తంగా ఈనెల 23, 24 తేదీలలో నగరంలోని హోటల్ నోవాటెల్ నందు బి 2 బి సదస్సు జరుగుతుందని నిర్వాహకులు కె ఎస్ ఫణీంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. "యుఎఇ ద్వారా అంతర్జాతీయ మార్కెట్లలో వ్యాపారాన్ని విస్తరించడమే లక్ష్యంగా ఈ సదస్సు జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమం యుఎఇకి కార్యకలాపాలను విస్తరించడం వల్ల కలిగే వ్యూహాత్మక ప్రయోజనాల గురించి, ముఖ్యంగా ఈ ప్రాంతంలోని అత్యంత శక్తివంతమైన, పెట్టుబడిదారులకు అనుకూలమైన ఫ్రీ జోన్‌లలో ఒకటైన సైఫ్ జోన్ ద్వారా ఆంధ్రప్రదేశ్‌లోని వ్యాపార సంస్థలకు అవగాహన కల్పించడం లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు.

సోనీ నుంచి బ్రావియా 8.2 క్యూడీ-ఒఎల్‌ఇడి సిరీస్

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : బ్రావియా 8.2 సిరీస్ విడుదల చేస్తోన్నట్లు సోనీ ఇండియా రీజినల్ ఇంచార్జి ఎల్ .అనిల్ తెలిపారు. నగరంలోని సోనీ షోరూంలో జరిగిన కార్యక్రమంలో వివరాలను వెల్లడిస్తూ... అపూర్వ విజయం సాధించిన టెలివిజన్ల శ్రేణికి ఇది విప్లవాత్మకమైన జోడింపు అన్నారు. ఈ కొత్త సిరీస్ అత్యాధునిక క్యూడీ-ఓఎల్‌ఈడీ టెక్నాలజీని అధునాతన ఏఐ ప్రాసెసర్ ఎక్స్‌ఆర్‌తో మిళితం చేసి సాటిలేని చిత్ర నాణ్యత, జీవితపు తరహా ఆడియో అనుభవాలను అందిస్తుందన్నారు. ఆధునిక వీక్షకుడి అభిరుచులకు అనుగుణంగా రూపొందించబడిన బ్రావియా 8 2 సిరీస్ పరిపూర్ణ నలుపు, ఖచ్చితమైన షాడో వివరాలు, డైనమిక్ కాంట్రాస్ట్‌ను అందిస్తుందని తెలిపారు. అదే సమయంలో అకౌస్టిక్ సర్ఫేస్ ఆడియో ప్లస్ డాల్బీ విజన్ అట్మాస్, ప్రముఖ స్ట్రీమింగ్ సేవల సహకారంతో అభివద్ధి చేయబడిన వివిధ స్టూడియో కాలిబ్రేటెడ్ మోడ్‌లతో ధ్వనిని అందిస్తుందని తెలిపారు.

అమెజాన్ ఇండియా నెట్‌వర్క్ విస్తరణకు ప్రణాళిక

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : అత్యంత సురక్షితమైన, వేగవంతమైన, విశ్వసనీయ కార్యకలాపాల నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసుకుని, నిర్వహించడానికి తన నిబద్ధతలో భాగంగా, అమెజాన్ 2025లో రూ.2000 కోట్లకు పైగా పెట్టుబడి పెట్టనుందని సంస్థ ప్రతినిధి అమిత్ . జె. తెలిపారు. నగరంలోని ఓ హోటల్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను వెల్లడించారు. పెట్టుబడి కార్యకలాపాల మౌలిక సదుపాయాలను విస్తరించడానికి, అప్‌గ్రేడ్ చేయడానికి, ప్రణాళిక రూపొందించిందని అన్నారు. భాగస్వాముల భద్రత, సంక్షేమ కార్యక్రమాలను మెరుగుపరచడానికి, తన ఫుల్‌ఫిల్‌మెంట్ నెట్‌వర్క్‌కు కొత్త సాధనాలు, సాంకేతికతను అభివద్ధి చేసుకునేందుకు వినియోగించనున్నామని తెలిపారు. ఈకొత్త పెట్టుబడి అన్ని పిన్-కోడ్‌లకు కంపెనీ తన ఉత్పత్తులను అందించడానికి సహాయపడే ఓపీఎస్ నెట్‌వర్క్‌ను సష్టించడంలో అమెజాన్ పెట్టుబడులపై ఆధారపడి ఉంటుందని తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం
పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...
మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218
విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.